

ఎంపీఈఓలతో చెడుగుడు

- టీడీపీ హయాంలో నియామకం
- ఒక్కొక్కరి పరిధిలో 2,500 ఎకరాలు
- ఆర్బీకేలు వచ్చాక 10 వేల ఎకరాల దాకా..
- వీఏఏలు లేనిచోట మాత్రమే అవకాశం
- మిగిలినవారు ఓడీ కింద చిత్తూరుకు..
- అక్కడికి వెళ్లని 50 మంది తొలగింపు
- ఉద్యోగ భద్రత లేని ఎంపీఈఓ వ్యవస్థ



అనంతపురం అర్బన్

ఎంపీఈఓల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటం ఆడుతోంది. వారి ఉద్యోగాలు తుమ్మితే ఊడిపోయే ముక్కులా తయారయ్యాయి. రైతు భరోసా కేంద్రాల వ్యవస్థను అమలులోకి ఉద్యోగ భద్రత లేకుండా పోయింది. టీడీపీ హయాంలో 2015లో జిల్లా సెలెక్షన్ కమిటీ ద్వారా ఉమ్మడి జిల్లాలో 650 మంది మల్టీ పర్పస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్స్‌ను (ఎంపీఈఓలు) కాంట్రాక్టు పద్ధతిలో ఎంపిక చేశారు. అప్పట్లో వెయ్యి హెక్టార్లకు ఒక ఎంపీఈఓను నియమించారు. వీరంతా వ్యవసాయ శాఖ తరఫున క్షేత్ర స్థాయిలో పనిచేస్తూ వచ్చారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. రైతు భరోసా కేంద్రాల్లో కొత్తగా వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్, పశుసంవర్ధక శాఖ తరఫున గ్రామస్థాయి సిబ్బందిని నియమించింది. దీంతో ఎంపీఈఓలకు గడ్డుకాలం మొదలైంది.

ఆర్బీకేల ఏర్పాటుతో అన్యాయం

జిల్లాలో జనాభా ప్రాతిపదికన ఆర్బీకేలను ఏర్పాటు చేశారు. రెండువేల మంది జనాభాకు ఒక ఆర్బీకే ఏర్పాటు చేసి, సిబ్బందిని నియమించారు. జిల్లాలో ఖరీఫ్, రబీ సాగు విస్తీర్ణం ఎక్కువే. వ్యవసాయ శాఖ పరిధిలో 9.31 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. ఉద్యాన శాఖ పరిధిలో 1.22 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. మొత్తం 10.53 లక్షల ఎకరాల్లో ఖరీఫ్, రబీ సీజనల్లో పంటలు సాగవుతున్నాయి. గత ప్రభుత్వం హయాంలో ఉమ్మడి జిల్లాలో ప్రతి వెయ్యి హెక్టార్లకు (2500 ఎకరాలు) ఒక ఎంపీఈఓను నియమించారు. ప్రస్తుతం అనంతలో 455, శ్రీసత్యసాయిలో 416 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. ఒక్కో ఆర్బీకేలో ఒక విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ (వీఏఏ) పనిచేస్తున్నారు. వీఏఏ లేనిచోట ఎంపీఈఓను కేటాయించారు.



పుట్లూరులోని ఆర్బీకే

పనిభారం

గతంలో ఒక ఎంపీఈఓకు 2500 ఎకరాల పరిధి ఉండేది. కానీ ఒక్కో ఆర్బీకే పరిధిలో నాలుగు వేల నుంచి పది వేల ఎకరాల విస్తీర్ణంలో పంట పొలాలు ఉన్నాయి. గతంలో 2,500 ఎకరాల విస్తీర్ణం మాత్రమే ఎంపీఈఓలకు ఉండగా, ఇప్పుడు రెండు నుంచి నాలుగు రెట్లు పెరిగింది. పనిభారం పెరగడంతోపాటు.. ఎంపీఈఓలు మిగులుబాటు అయ్యారు. వీరిని సర్దుబాటు కింద చిత్తూరు జిల్లాకు బదిలీ చేశారు. కాంట్రాక్టు పద్ధతిన, అందులోనూ తక్కువ వేతనానికి పనిచేసే ఎంపీఈఓలకు పొరుగు జిల్లాకు పొమ్మనడంతో చాలామంది వెళ్లడానికి ఇష్టపడలేదు. ఎంపీఈఓలలో మహిళలు ఎక్కువగా ఉండటమూ దీనికి ఇంకో కారణం.

మచ్చుకు కొన్ని...

కళ్యాణదుర్గం మండలంలోని ఉలికల్లు ఆర్బీకే పరిధిలో ఆరు వేలు ఎకరాల సాగుభూమి ఉంది. అదే మండలంలోని తిమ్మసముద్రం, ముద్దినాయనపల్లి, మానిరేవు, గోళ్ల, ఈస్టుకోడిపల్లి ఆర్బీకేల పరిధిలో 8వేల నుంచి 10వేల ఎకరాలకుపైగా విస్తీర్ణంలో పంట పొలాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ఎక్కువ శాతం ఆర్బీకేల్లో ఇలాంటి పరిస్థితే ఉంది. ఆర్బీకేల పరిధిలో సిబ్బంది ఈ-క్రాపింగ్‌తోపాటు ఫీల్డ్ వెరిఫికేషన్, ఈకేవైసీ, వేరుశనగ, ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ, శాఖాపరంగా ఇతర పనులు చేస్తున్నారు. పనిభారంతో సతమతమవుతున్నారు.

250 మంది బదిలీ...

టీడీపీ హయాంలో ఉమ్మడి జిల్లాలో 650 మంది ఎంపీఈఓలు పనిచేసేవారు. వీరిలో 175 మంది వీఏఏ పోస్టులకు ఎంపికయ్యారు. మిగతా 475 మంది ఎంపీఈఓలుగానే మిగిలిపోయారు. జనాభా ప్రాతిపదికన వీరికి పోస్టులు కేటాయించడంతో పోస్టులు తగ్గిపోయాయి. ఇలా మిగిలిన 205 మంది ఎంపీఈఓలను 2020లో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ఆన్ డ్యూటీ (ఓడీ) కింద బదిలీ చేశారు. వీరిలో 107 మంది ఉమ్మడి చిత్తూరులో పనిచేస్తున్నారు. మిగిలిన వారు అనారోగ్యం, ప్రసూతి సెలవులు, ఆర్థిక, కుటుంబ పరమైన సమస్యలతో తిరిగి వచ్చారు. మరికొందరు ఓడీపై వెళ్లలేక మిన్నకుండిపోయారు. ఇలా అనంతపురం జిల్లాలో 50 మంది, శ్రీసత్యసాయిలో 48 మంది ఎంపీఈఓలు నాట్ వర్కింగ్‌లో ఉండిపోవాల్సి వచ్చింది.

విధుల నుంచి తొలగింపు

ఉమ్మడి చిత్తూరు జిల్లాకు వెళ్లని కారణంగా 50 మంది ఎంపీఈఓలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు ఉద్యోగం నుంచి నిర్దాక్షిణ్యంగా తొలగించారు. చిత్తూరు జిల్లాకు పంపాలన్న నిర్ణయాన్ని ఎంపీఈఓల సంఘం ఆదిలోనే వ్యతిరేకించింది. జిల్లాలోనే పోస్టింగ్ ఇవ్వాలని ఆ సంఘం నాయకులు కోరుతూ వచ్చారు. జిల్లాలో 1500 ఎకరాలకు ఒక ఎంపీఈఓ పోస్టును కేటాయిస్తే సమస్య పరిష్కారమవుతుందని విన్నవించారు. వ్యవసాయ శాఖ కమిషనర్ సానుకూలంగా స్పందించారని, 1500 ఎకరాలకు ఒక ఎంపీఈఓని నియమించేందుకు అంగీకరించి, ఫైల్ రెడీ చేశారని తెలిసింది. ఈ నేపథ్యంలో తమకు తిరిగి ఉద్యోగ అవకాశం లభిస్తుందని ఎంపీఈఓలు నిరీక్షిస్తున్నారు. ఇలాంటి సమయంలో ఉద్యోగాల నుంచి తొలగించడం సరికాదని బాధితులు అంటున్నారు. అనారోగ్యం, ప్రసూతి సెలవులు, మహిళలు కావడం తదితర కారణాలతో వేరే జిల్లాకు వెళ్లలేకపోయామని, తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. కొందరు మహిళా ఎంపీఈఓలు తరచూ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయానికి వచ్చి, ఏదో ఒక ఆర్బీకేలో చోటు కల్పించాలని కోరుతున్నారు.



జిల్లాలోనే ఇవ్వాలి..

జిల్లాలో ప్రతి 1500 ఎకరాల విస్తీర్ణానికి ఒక ఎంపీఈఓను నియమించేలా చర్యలు తీసుకోవాలి. జిల్లా నుంచి ఓడీపై ఉమ్మడి చిత్తూరుకు బదిలీ చేసిన ఎంపీఈఓలందరికీ తిరిగి జిల్లాలో పోస్టింగ్ ఇవ్వాలి. ఓడీపై వెళ్లలేదన్న కారణంగా 50 మంది ఎంపీఈఓలను తొలగించడం సరికాదు. వారికి తిరిగి ఉద్యోగ అవకాశం కల్పించాలి. రైతు భరోసా కేంద్రాల్లో పనిచేసే వీఏఏలకు సమానంగా ఎంపీఈఓలు విధులు నిర్వరిస్తున్నారు. ఆర్బీకే సిబ్బందికి సమానంగా ఎంపీఈఓలకు వేతనం ఇవ్వాలి. టైం స్కేల్ వర్తింపజేయాలి.

- నాగరాజు, ఎంపీఈఓల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



ఉద్యోగ భద్రత కల్పించాలి..

జిల్లా సెలెక్షన్ కమిటీ ద్వారా కాంట్రాక్టు పద్ధతిలో నియమితులైన ఎంపీఈఓలకు ఉద్యోగ భద్రత కల్పించాలి. ఏటా సకాలంలో రెన్యువల్ చేసి, ప్రతినెలా వేతనాలు చెల్లించాలి. జనాభా ప్రాతిపదికన ఆర్బీకేలు ఏర్పాటు చేయడం ద్వారా ఎంపీఈఓలకు అన్యాయం జరిగింది. ఆ సాంకేతిక తప్పిదాన్ని సరిచేసి, ప్రతి 1500 ఎకరాలకు ఒక ఎంపీఈఓని నియమించాలి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్న జిల్లాకు చెందిన ఎంపీఈఓలతోపాటు అక్కడికి వెళ్లలేక ఖాళీగా ఉన్నవారికి జిల్లాలోనే పోస్టింగ్ ఇవ్వాలి.

- రవి, ఉమ్మడి జిల్లా ఎంపీఈఓల సంఘం అధ్యక్షుడు

నీటి కోసం నిరీక్షణ

- పల్లెకు చేరని తుంగభద్ర జలాలు
- రూరల్, అర్బన్ పంచాయతీల్లో నీటి ఎద్దడి
- నత్త నడకన సాగుతున్న పైప్‌లైన్ పనులు
- టీడీపీ హయాంలో జీవో.. వైసీపీ వచ్చాక జాప్యం



చిన్నంపల్లి గ్రామ సమీపంలో పైపులైన్‌కోసం తవ్విన దృశ్యం

అనంతపురం రూరల్

తుంగభద్ర జలాల కోసం కొన్నేళ్ల నుంచి ఆ ప్రాంతాల జనం ఎదురుచూస్తున్నారు. ఆ నీరొస్తే.. తాగునీటి సమస్య తీరుతుందని కలలు కంటున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు ఆ దిశగా ప్రయాత్నాలు చేస్తున్నారు. టీడీపీ హయాంలో జీవో ఇచ్చారు. ఎన్నికలు రావడంతో కార్యరూపం దాల్చలేదు. వైసీపీ అధికారంలోకి వచ్చాక కూడా ఇదే హామీ ఇచ్చారు. నాలుగున్నరేళ్ల పట్టించుకోలేదు. ఆ తరువాత పనులు చేపట్టారు. ఎన్నికలు వచ్చేలోగా పనులు పూర్తి చేసి, నీటిని అందిస్తామని స్థానిక ప్రజాప్రతినిధులు చెప్పుకున్నారు. పైపులైన్ పనులకు భూమి పూజ చేసి రెండు నెలలు కావస్తోంది. సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్‌కు రెండు వారాల సమయం లేదు. ఎన్నికల కోడ్ వచ్చేలోగా పనులు పూర్తి చేయడం సాధ్యమేనా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇదంతా ఎన్నికల హడావుడేనని, తాగునీరు ఇవ్వాలన్న చిత్తశుద్ధి ఉంటే.. నాలుగున్నరేళ్ల ఎందుకు పట్టించుకోలేదని పలువురు విమర్శిస్తున్నారు.

రూ. 47. 59 కోట్లతో..

అనంతపురం అర్బన్ పంచాయతీలు, రూరల్ మండలంలోని పంచాయతీల పరిధిలో గ్రామాలకు తుంగభద్ర నీటిని సరఫరా చేసేందుకు రూ.47.59 కోట్లు కేటాయించారు. అర్బన్ పరిధిలోని రాజీవ్ కాలనీ, ఎ.నారాయణపురం, రుద్రంపేట పంచాయతీలకు రూ.7.88 కోట్లు, రూరల్ పరిధిలోని ప్రాంతాలకు రూ.39.71 కోట్లు కేటాయించారు. పనులు పూర్తి చేసి, రోజుకు 50 లక్షల లీటర్ల నీటిని సరఫరా చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ పనులు పూర్తయితే.. ఆయా గ్రామాల ప్రజలకు తాగునీటి సమస్య తీరుతుంది.



చిన్నంపల్లి వద్ద రోడ్డు పక్కన వేసిన పైపులు

నత్తనడకన..

పాపంపేట, కక్కలపల్లి కాలనీ, కురుగుంట, కామారుపల్లి, చిన్నంపల్లి, రాచానపల్లి పంచాయతీలకు తుంగభద్ర జలాలు సరఫరా చేయాల్సి ఉంది. ఈ పనులకు చిన్నంపల్లి క్రాస్‌లో స్థానిక ప్రజాప్రతినిధులు జనవరి 6న భూమి చేశారు. కానీ పనులు వేగంగా సాగడం లేదు. నీటి సరఫరా పైపులు కూడా అక్కడక్కడ దింపారు. చిన్నంపల్లి గ్రామ సమీపంలో ఫిబ్రవరి ఆరంభంలో పైపులైన్ పనులు ప్రారంభించారు. నెల కావస్తున్నా.. అర కిలో మీటరు కూడా పనులు పూర్తి కాలేదు. ఒకరోజు పనిచేస్తే.. నాలుగైదు రోజులు విరామం తీసుకుంటున్నారు. ఈ రీతిలో పనులు జరిగితే ఎప్పటికి పూర్తి అవుతాయని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికే పాపంపేట, కక్కలపల్లి కాలనీ పంచాయతీ తదితర ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చింది. నీటి కోసం జనం అల్లాడిపోతున్నారు. సత్యసాయి నీరు పదిరోజులకు ఒకసారి వచ్చేదీ గగనంగా మరింది. ఒక్కోసారి నెల గడిచినా నీరు రావడం లేదని స్థానికులు వాపోతున్నారు.

పనులు జరుగుతున్నాయి..

జలజీవన్ మిషన్ పథకం కింద తుంగభద్ర జలాల సరఫరాకు సంబంధించిన పనులు జరుగుతున్నాయి. పూర్తిస్థాయి స్థాయిలో పనులు చేసేందుకు సమయం పడుతుంది. పైపులైన్ పనులు పూర్తి చేసి, సత్యసాయి మంచినీటి పథకం పైపులైన్ నుంచి నీటిని సరఫరా చేయాలని ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. చిన్నంపల్లి గ్రామ సమీపంలో పనులు జరుగుతున్నాయి. అక్కంపల్లి పంచాయతీ సమీపంలోని ఇంటెల్ కాలేజ్ నుంచి సిండికేట్ నగర్ వరకు పైపులైన్ పనులు పూర్తి అయ్యాయి. అక్కడి నుంచి బళ్లారి రోడ్డు సర్కిల్ వరకు పైపులైన్ పనులకు హైవే అధికారుల అనుమతులు తీసుకోవాల్సి ఉంది.

- ఆంజనేయులు, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్

ఇలా కడితే జైలుకు పంపుతాం



కూలిన పైకప్పును పరిశీలిస్తున్న కాలవ

మాజీ మంత్రి కాలవ

రాయదుర్గం, ఫిబ్రవరి 29: ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేసి, నాసిరకంగా జగనన్న ఇళ్లను నిర్మించినవారిని జైలుకు పంపిస్తామని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు హెచ్చరించారు. పట్టణంలో కూలి పోయిన జగనన్న ఇంటిని గురువారం ఆయన పరిశీలించారు. బాధితులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వైసీపీ నాయకులు పేదల జీవితాలతో ఆడుకుంటున్నారని మండిపడ్డారు. మల్లాపురం లే అవుట్‌లో గృహప్రవేశానికి ముందే ఇల్లు కూలిపోవడం బాధాకరమని అన్నారు. వైసీపీ కౌన్సిలర్ భర్త గిడ్డ సత్తి రూ.3.10 లక్షలు తీసుకుని, కాంపౌండ్ నిర్మించకుండా నాసిరకంగా ఇంటిని నిర్మించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ హయాంలో శాశ్వతమైన, సౌకర్యవంతమైన ఇళ్లను నిర్మించామని తెలిపారు. ఇళ్ల నిర్మాణం నాసిరకంగా జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని నిలదీశారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని అన్నారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

జిల్లాలో 41,556 మంది విద్యార్థులు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 29: ఇంటర్ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ నెల 20వ తేదీ వరకూ పరీక్షలు జరుగుతాయి. నిర్ణీత తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్షలను నిర్వహిస్తారు. జిల్లా వ్యాప్తంగా మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులు 41,556 మంది పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 24,446 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 17,110 మంది ఉన్నారు. వీరికోసం జిల్లావ్యాప్తంగా 58 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లను ఇంటర్ ఎగ్జామ్స్ కన్వీనర్ వెంకటరమణ నాయక్ గురువారం పరిశీలించారు. పరీక్షల విధులకు 1,300 మంది ఇన్విజిలేటర్లు, 58 మంది చీఫ్ సూపరింటెండెంట్స్, 58 డిపార్టుమెంట్ ఆఫీసర్లను నియమించారు. రెండు ఫ్లయింగ్ స్క్వాడ్స్, రెండు సిట్టింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేశారు.



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎగ్జామ్స్ కన్వీనర్ వెంకట రమణ

నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయాలి

శ్రీకృష్ణపై దాడి కేసును నిర్వీర్యం చేస్తున్నారు

బీఎల్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణప్ప

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 29: ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిచేసిన వారిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయాలని బహుజన లాయర్స్ ఫోరం (బీఎల్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు నారాయణప్ప డిమాండ్ చేశారు. ఈ దాడిని బీఎల్ఎఫ్ తీవ్రంగా ఖండిస్తోందని అన్నారు. నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బహుజనులపై దాడులు, దౌర్జన్యాలు నిత్యకృత్యమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయపార్టీలు తమ స్వలాభం కోసం బహుజనులపై బహుజనలచేతనే దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. ఆంధ్రజ్యోతి, ఈనాడు వంటి మీడియా సంస్థల్లో పనిచేస్తున్న వారిపై భౌతిక దాడులు చేయడం, భయభ్రాంతులకు గురిచేయడం సరికాదని అన్నారు. శ్రీకృష్ణపై దాడిచేస్తున్నవారు వీడియోలో స్పష్టంగా కనిపిస్తున్నా, ఏడేళ్ల లోపు శిక్షపడే కేసులు నమోదు చేశారని, ముద్దాయిలను రక్షించేందుకు పోలీసులు ప్రయత్నించడం దుర్మార్గమని అన్నారు. గుంపుగా దాడిచేసినా ఒకరిపై మాత్రమే 307 సెక్షన్ కింద కేసు నమోదు చేశారని, ఇది చట్టాన్ని ఉల్లంఘించడం కాదా అని ప్రశ్నించారు. కర్రలతో దాడిచేస్తూ, హత్యాయత్నానికి పాల్పడినా ఎఫ్ఐఆర్‌లో పేర్కొనకపోవడం కేసును నిర్వీర్యం చేయడమేనని అన్నారు. దాడి తీవ్రతను నీరుగారుస్తూ రిమాండ్ రిపోర్టును తయారుచేసి న్యాయస్థానాలను తప్పుదోవ పట్టించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదమని ఆందోళన వ్యక్తం చేశారు. ఏడేళ్లకు పైగా శిక్షపడే కేసు నమోదుచేస్తేనే ముద్దాయిలకు న్యాయస్థానం రిమాండ్ విధిస్తుందని అన్నారు. దాడి ఘటనలో ముద్దాయిలందరినీ తక్షణమే అరెస్టు చేసి, నాన్ బెయిలబుల్ కేసులు పెట్టి లోపలికి పంపాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు ఆనంద్, సురేష్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఎల్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణప్ప

ఐరన్, బియ్యం దుకాణాల్లో తనిఖీలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 29: రాయలసీమ జిల్లాల తూనికలు, కొలతల శాఖాధికారులు మెరుపుదాడులు నిర్వహించారు. ఒక డిప్యూటీ కంట్రోలర్, ఇద్దరు అసిస్టెంట్ కంట్రోలర్లు, ఆరుగురు ఇన్స్‌పెక్టర్లు జిల్లాలోని ఐరన్, బియ్యం, తినుబండారాల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ముద్రలేని కాటాలు వాడుతున్నట్లు గురించి ఐరన్ దుకాణాలపై మూడు కేసులు నమోదు చేశారు. అధిక ధరలకు తినుబండారాలు విక్రయిస్తున్న దుకాణలపై ఆరు కేసులు నమోదు చేశారు. ప్యాకేజీ వస్తువులపై వివరాలు ముద్రించనందుకు మూడు కేసులు నమోదు చేశామని కర్నూలు జిల్లా లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్ చల్లా దయాకర్‌రెడ్డి తెలిపారు. ఇకపై రాయలసీమ జిల్లాల్లో ఆకస్మిక దాడులు నిర్వహిస్తామని, నిబంధనల పాటించకపోతే కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

కలిసి పనిచేస్తా..!

కళ్యాణదుర్గం కలలు నెరవేరుస్తా

టీడీపీ అభ్యర్థి అమిలినేని సురేంద్ర బాబు

కళ్యాణదుర్గం రూరల్, ఫిబ్రవరి 29: టీడీపీ కళ్యాణదుర్గం నియోజకవర్గ అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబుకు జనం నీరాజనం పట్టారు. పార్టీ అభ్యర్థిత్వం ఖరారయ్యాక ఆయన గురువారం తొలిసారి పట్టణానికి వచ్చారు. అంతకు ముునుపు అనంతపురం నుంచి వందలాది వాహనాలతో బయలుదేరి, పంపనూరులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సిబాయి గ్రామంలో ఆంజనేయ స్వామికి, గోళ్ల అంజనేయస్వామికి, అక్కమ్మగార్ల ఆలయానికి చేరుకుని పూజలు నిర్వహించారు. సురేంద్రబాబు వస్తున్నారన్న సమాచారంతో నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి భారీ ఎత్తున కార్యకర్తలు, నాయకులు పట్టణానికి చేరుకున్నారు. టీ సర్కిల్‌లో బాణసంచా పేల్చి ఆయనను స్వాగతించారు. ఈ సందర్భంగా సురేంద్రబాబు మాట్లాడుతూ, కళ్యాణదుర్గం టీడీపీకి కంచుకోట అని, స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి పనిచేస్తానని అన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే జీడిపల్లి, కుందుర్పి బ్రాంచ్ కెనాల్ పనులను పూర్తి చేస్తామని అన్నారు. నియోజకవర్గ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న 114 చెరువులకు నీరు ఇచ్చే కలను సాకారం చేస్తానని హామీ ఇచ్చారు. కళ్యాణదుర్గం అన్ని రంగాలలో వెనుకబడిన ప్రాంతమని, ఈ ప్రాంతానికి రోడ్లు, సాగు, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలన్నీ కల్పిస్తామని అన్నారు. టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌ను నెలకొల్పుతామని తెలిపారు. సైకోను పారదోలి ప్రజాపాలనను తీసుకొద్దామని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితే అన్ని వర్గాలవారికి న్యాయం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ రాజు, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కరణం రామ్మోహన్ చౌదరి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చౌలం మల్లికార్జున, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి అమిలినేని లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న నాయకులు



టీ సర్కిల్‌లో జన సందోహం.. ప్రసంగిస్తున్న సురేంద్ర బాబు

వందనంతో వల

ఎన్నికల వేళ వలంటీర్లకు తాయిలాలు

మూడు నెలలు ముందే ప్రోత్సాహకాలు

నగదు మొత్తం పెంచి పంపిణీ

అనుకూలంగా మలుచుకునేందుకు వైసీపీ కుయుక్తులు

ధర్మవరం, ఫిబ్రవరి 29: రాష్ట్ర ప్రభుత్వంపై అన్నివర్గాల నుంచి తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది. ఉద్యోగవర్గాల్లో పీకల్లోతు కోపం ఉంది. వారికి రావాల్సిన బకాయిలను కూడా ప్రభుత్వం సకాలంలో చెల్లించకుండా చెడుగుడు అడుకుంటోంది. వలంటీర్లతో గొడ్డు కష్టం చేయించుకుంటూ గౌరవ వేతనం అంటూ వారి జీవితాలతో ఆటలాడుకుంటోంది. సీఎం జగన్ తీసుకొచ్చినా వ్యవస్థే అయినా.. ప్రభుత్వ తీరుతో విసిగిపోయిన వలంటీర్లు ఇటీవల తిరగబడటం ప్రారంభించారు. గౌరవ వేతనం పెంచాలంటూ ఉద్యమం చేశారు. నాడు వారి డిమాండ్లను పట్టించుకోని ప్రభుత్వం.. ఎన్నికల వేళ ప్రోత్సాహక తాయిళాలతో వలంటీర్లపై వల వేస్తోంది. ఎన్నికలకు ముందు వారిని తమకు అనుకూలంగా మలుచుకునేందుకు అనేక కుయుక్తులు పన్నుతోంది. మే నెలలో ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలను మూడు నెలలు ముందుగానే అందజేస్తోంది. దారుణంగా ఉన్న రోడ్లను పట్టించుకోరు, బిల్లులు అందక ఆగిపోయిన సచివాలయ భవనాలు, అస్పత్రుల నిర్మాణం, ప్రభుత్వోద్యోగులకు బకాయిలు చెల్లించరు. ఆఖరుకు పేదలకు వైద్యం అందించే ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీ బకాయిలను కూడా జయచేయరు. షెడ్యూల్ కన్నా మూడు నెలల ముందు ఎన్నికల ముంగిట వలంటీర్లకు మాత్రం వందనం పేరుతో భారీ నగదు ప్రోత్సాహకాలను అందజేస్తున్నారు. ఈ తంతు చూస్తున్న ఉద్యోగులు, సామాన్యులు.. ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు.

ప్రోత్సాహక నగదు పెంపు

ఎన్నికల నేపథ్యంలో ప్రోత్సాహకాలు అందుకునే వలంటీర్ల సంఖ్య, అందజేసే నగదు మొత్తం పెరిగింది. జిల్లాలో మొత్తం 544 గ్రామ, వార్డు సచివాలయాలున్నాయి. వీటి పరిధిలో పనిచేస్తున్న దాదాపు అందరికీ ప్రోత్సాహకాలు అందజేస్తున్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమం కింద గతేడాది మే నెలలో జిల్లాలోని మొత్తం 8490 మంది వలంటీర్లకు నగదు ప్రోత్సాహకం అందజేశారు. వీరిలో 8263 మందికి సేవామిత్ర, 193 మందికి సేవారత్న, 34 మందికి సేవా వజ్ర అవార్డులు ఇచ్చారు. గతేడాది సేవామిత్రకు రూ.10వేలు, సేవారత్నకు రూ.20వేలు, సేవావజ్రకు రూ.30వేలు చొప్పున అందజేశారు. ప్రస్తుతం జిల్లాలో 9343 మంది వలంటీర్లకు ప్రోత్సాహకాలు అందజేశారు. అందులో సేవామిత్ర 9125 మందికి, సేవారత్న 187 మందికి, సేవావజ్ర 31 మందికి ఇచ్చారు. ప్రస్తుతం సేవామిత్రకు రూ.15వేలు, సేవారత్నకు రూ.30వేలు, సేవా వజ్రకు రూ.45వేలు చొప్పున అందజేశారు.

వలంటీర్లకు బ్రెయిన్ వాష్

భారీ కార్యక్రమం ఏర్పాటుచేసి వలంటీర్లకు ప్రోత్సాహకాలను అందజేశారు. మండలాలు, డివిజన్లు, నియోజకవర్గాల వారీగా ఈ కార్యక్రమాలు నిర్వహించారు. వీటిలో వలంటీర్ల బ్రెయిన్ వాష్ చేసినట్లు తెలుస్తోంది. ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులే కాకుండా అనేకమంది వేదికలపై ప్రసంగించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి అనుకూలంగా వలంటీర్లు పనిచేసేలా భారీ కుట్రలు పన్నుతున్నారంటూ ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

వేరుశనగకు వైరస్

నిలువునా ఎండుతున్న పైరు



వైరస్ సోకి ఎండిపోయిన వేరుశనగ మొక్కలు

రాప్తాడు, ఫిబ్రవరి 29: రబీలో సాగుచేసిన వేరుశనగను వైరస్ వెంటాడుతోంది. పంట నిలువునా ఎండిపోతోంది. రాప్తాడు మండలంలో బోరు బావుల కింద నవంబరు, డిసెంబరు నెలల్లో వేల ఎకరాల్లో వేరుశనగ సాగు చేశారు. రాప్తాడు, హంపాపురం, గొందిరెడ్డిపల్లి, మరూరు, బండమీదపల్లి, యర్రగుంట, గాండ్లపర్తి, కొత్తపల్లి, పాలచెర్ల, బోగినేపల్లి తదితర గ్రామాల్లో రబీ కింద వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి.. వేరుశనగ సాగు చేశారు. కే-6, ట్యాగ్, 1694, 1218 రకాల విత్తనం వేశారు. కొన్ని రకాలకు విత్తిన నెల రోజుల నుంచి వైరస్ సోకడం మొదలైంది. విత్తన శుద్ధి మందు కలిపినా ప్రయోజనం లేకుండాపోయిందని రైతులు వాపోతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు పొలాల వైపు కన్నెత్తి చూడటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే స్పందించి, పంటను కాపాడుకునే మార్గం చూపించాలని కోరుతున్నారు.

పోక్సో కేసులో ఇద్దరికి పదేళ్ల జైలు

నల్లమాడ, ఫిబ్రవరి 29: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై లైంగిక దాడి కేసులో ముద్దాయిలు సెల్వరాజ్, చంద్రిన్‌కు పదేళ్ల జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ అనంతపురం సెషన్స్ కోర్టు తీర్పు వెల్లడించినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. మండలంలోని ఓ క్వారీలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన సెల్వరాజ్, చంద్రిన్ పనిచేస్తుండేవారు. 2022 మే 15న ఓ బాలిక పొలంలో గడ్డి కోస్తుండగా సెల్వరాజ్, చంద్రిన్ లైంగిక దాడికి యత్నించారు. అప్పట్లో బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు నిందితులపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఏడుగురు సాక్షులను విచారించిన సెషన్స్ కోర్టు న్యాయాధికారి.. నిందితులను నేరస్థులుగా పరిగణిస్తూ గురువారం తీర్పు వెలువరించారు. బాధితురాలికి రూ.2 లక్షలు పరిహారం ప్రభుత్వం చెల్లించాలని ఆదేశించారని ఎస్ఐ పేర్కొన్నారు.

అధికారమా.. మజాకా..

వెలుగు కార్యాలయంలో వైసీపీ సమీక్ష

చోద్యం చూసిన అధికారులు

నల్లచెరువు, ఫిబ్రవరి 29: ప్రభుత్వ కార్యాలయాలు వైసీపీ కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. మండలకేంద్రంలోని వెలుగు కార్యాలయంలో గురువారం ఆ పార్టీ కార్యకర్తల సమీక్ష సమావేశం జరగడమే ఇందుకు నిదర్శనం. వైసీపీ నాయకులు అధికారమా... మజాకా అన్న చందంగా వెలుగు కార్యాలయంలో సమీక్ష జరిపారు. ఈ నెల 3వ తేదీన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటన ఉండడంతో అందుకు సంబంధించిన ఏర్పాట్లపై వెలుగు కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యాలయంలోని ఓ గదిలో అధికారులు విధులు నిర్వహిస్తున్నా.. అదేదీ పట్టనట్టు వైసీపీ వారు అక్కడే సమీక్ష జరపడం గమనార్హం. వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మగ్బుల్‌బాషా, నాయకులు పూల శ్రీనివాసరెడ్డి, వజ్రభాస్కర్‌రెడ్డి, దశరథరామయ్యనాయుడు, విశ్వనాథ్‌రెడ్డి, హైదర్‌వలి, గోపాలకృష్ణ, భాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డిలు సభావేదికపై కూర్చొని కార్యకర్తలకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ విషయంపై ఏపీఎం రమణమ్మను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. ప్రిపరేషన్ ప్లాన్‌కోసం కార్యాలయం కావాలని వైసీపీ నాయకులు అడిగారని, దీంతో వెలుగు కార్యాలయం ఇచ్చామని పేర్కొన్నారు.

వైసీపీ సమావేశంలో ఉపాధ్యాయుడు



వైసీపీ సమావేశంలో పాల్గొన్న సుకుమార్ రెడ్డి (వృతంలో..)

తనకల్లు, ఫిబ్రవరి 29: మండలంలోని బొంతపల్లికి చెందిన సుకుమార్ రెడ్డి ప్రభుత్వ ఉపాధ్యాయుడు. కదిరి మండలంలోని పట్నంలో గల ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్నాడు. తనకల్లులోని మండ్లిపల్లి మిట్ట వద్ద గల ఎస్ఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించిన వైసీపీ సమావేశంలో ఉపాధ్యాయుడు సుకుమార్ రెడ్డి పాల్గొన్నాడు. ఏకంగా వేదికపై ఆసీనులయ్యాడు. ప్రభుత్వ ఉపాధ్యాయుడై ఉండి ఇలా పార్టీ సమావేశంలో పాల్గొనడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మర్యాద కావాలి..!

రోడ్డెక్కిన జడ్పీ పాలకవర్గం

- జడ్పీ సీఈఓ, డిప్యూటీ సీఈఓ తీరుపై ఆగ్రహం
- స్టాండింగ్ కమిటీ సమావేశాల బహిష్కరణ
- సీఈఓకు వ్యతిరేకంగా ఆవరణలో నినాదాలు
- సభ్యులతో కలిసి చైర్‌పర్సన్ గిరిజమ్మ నిరసన
- జడ్పీటీసీలకు గౌరవం ఇవ్వలేదని మండిపాటు
- తీర్మానాలు అమలు కావడం లేదని అసంతృప్తి



సీఈఓ, డిప్యూటీ సీఈఓపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సభ్యులు, చైర్ పర్సన్

అనంతపురం విద్య, ఫిబ్రవరి 29: జిల్లా పరిషత్‌లో అధికారులు, పాలకవర్గం మధ్య విభేదాలు తారస్థాయికిచేరాయి. ఉమ్మడి జిల్లా పరిషత్ పాలకవర్గ సభ్యులు జడ్పీ సీఈఓ, డిప్యూటీ సీఈఓ తీరుకు నిరసనగా రోడ్డుపైకి వచ్చారు. అధికార పార్టీకే చెందిన వీరు.. గురువారం స్టాండింగ్ కమిటీ సమావేశం నుంచి వాకౌట్ చేశారు. జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మతోపాటు 30 మంది వరకూ జడ్పీటీసీలు ఆందోళనకు దిగారు. ఈ వ్యవహారం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి అనంతపురం జిల్లా జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని గురువారం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించారు. గంటన్నర ఆలస్యంగా, మధ్యాహ్నం 12 గంటలకు సమావేశం ప్రారంభమైంది. ఆ వెంటనే గుడిబండ జడ్పీటీసీ భూతరాజు మీటింగ్ హాల్‌లో కింద కూర్చొని నిరసనకు దిగారు.

బైఠాయించిన జడ్పీటీసీలు

జడ్పీటీసీలకు డిప్యూటీ సీఈఓ లలితా బాయి, సీఈఓ నిదియా దేవి ఏమాత్రం గౌరవం, మర్యాద ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనకు మద్దతుగా జడ్పీటీసీలు తేజశ్విని, మమత, అశ్విని, శీన, హసీనా, కవిత, మహేష్, జయరాం తదితరులు కింద కూర్చుని, అధికారుల తీరుపై విమర్శలు గుప్పించారు. నాలుగు రోజుల క్రితం జడ్పీటీసీ భూతరాజు సీఈఓ చాంబర్‌లోకి వెళితే.. 'యూజ్‌లెస్ ఫెలో..' అని దూషించారని, 'కాల్ ద పోలీస్' అని సిబ్బందికి పురమాయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ్యులన్న మర్యాద కూడా ఆమెకు లేదా అని నిలదీశారు. జడ్పీ సర్వసభ్య సమావేశంలో చేసిన తీర్మానాలు అమలు చేయడం లేదని, తీర్మానం కాపీలను సైతం మాయంచేశారని అన్నారు. 'త్వరలో ఎన్నికలు వస్తున్నాయి. తాగునీటి పనుల కోసం ఇచ్చిన ప్రతిపాదనల ఫైళ్లకు ఆమోదం తెలుపకుంటే ఎలా..?' అని జడ్పీటీసీలు సీఈఓ, డిప్యూటీ సీఈఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు చేయకుండా ప్రజల్లోకి వెళితే తన్నేలా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలు, పనుల విషయంలో వెళితే డిప్యూటీ సీఈఓ లలితా బాయి గంటల తరబడి వేచి చూసేలా చేస్తారని అసహనం వ్యక్తం చేశారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే రాజీనామా చేస్తామని అన్నారు.

గౌరవం కోసం..

జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ వారించినా సభ్యులు వినుకోలేదు. జడ్పీ సీఈఓ నిదియా దేవి వివరణ ఇవ్వబోయినా సభ్యులు పట్టించుకోలేదు. ఆ తరువాత జడ్పీటీసీలకు మద్దతుగా చైర్‌పర్సన్ సైతం గళం వినిపించారు. జడ్పీ గత సర్వసభ్య సమావేశంలో చేసిన తీర్మానాలను అమలు చేయాలని, సభ్యులకు మర్యాద ఇవ్వాలని జడ్పీటీసీల తరపున సీఈఓను కోరారు. ఈ విషయాలను సీఈఓ నిదియా దేవికి ఇంగ్లీష్‌లో అనువదించి చెప్పాలని డిప్యూటీ సీఈఓను కోరారు. దీంతో డిప్యూటీ సీఈఓ 'నువ్వే అనువదించు..' అన్నారు. ఆమె తీరుపై జడ్పీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'జడ్పీ చైర్‌పర్సన్, జడ్పీటీసీలు మీకు పనిమనుషుల్లా కనిపిస్తున్నారా..? ఏకవచనంతో ఎలా మాట్లాడుతారు..?' అని మండిపడ్డారు. ఇలాంటి డిప్యూటీ సీఈఓ తమకు వద్దే వద్దు అని అన్నారు. 'ఇక్కడ గౌరవం దక్కనప్పుడు, తీర్మానాలు అమలు చేయనప్పుడు సభ ఎందుకు..? సమావేశాలు ఎందుకు..?' అని చైర్ పర్సన్ గిరిజమ్మ మండిపడ్డారు. డిప్యూటీ సీఈఓ లలితాబాయిని రెండు రోజుల్లో ప్రభుత్వానికి సరెండర్ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. సభ్యులతో కలసి సమావేశం నుంచి వాకౌట్ చేశారు. ఆ వెంటనే సీఈఓ కూడా విసురుగా వెళ్లిపోయారు.



సభ్యులతో కలిసి వాకౌట్ చేస్తున్న చైర్‌పర్సన్ గిరిజమ్మ

సీఈఓకు వ్యతిరేక నినాదాలు

జడ్పీ కార్యాలయ ఆవరణలో జడ్పీటీసీలు, చైర్‌పర్సన్.. 'సీఈఓ డౌన్ డౌన్' అంటూ నినాదాలు చేశారు. జడ్పీలో తొమ్మిది నెలల నుంచి సభ్యులకు అవమానం జరుగుతోందని వారు అన్నారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామని, స్పందించకుంటే ముఖ్యమంత్రిని కలుస్తామని జడ్పీటీసీలు అన్నారు. జడ్పీలో అధికార పార్టీ సభ్యులు సుమారు గంట పాటు నిరసన తెలిపారు. రాష్ట్రంలో వైసీపీ అధికారంలో ఉంది. ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ పాలకవర్గం సైతం అధికార పార్టీవారిదే. వారే అధికారులకు వ్యతిరేకంగా ఆందోళనకు దిగడం, చైర్ పర్సన్ గొంతు కలపడం చర్చనీయాంశం అయ్యింది. కాగా, కలెక్టర్‌ను కలిసేందుకు వెళ్లిన జడ్పీటీసీలను సాయంత్రం వరకూ అనుమతి లభించలేదు. కలెక్టర్ నుంచి స్పందన రాకుంటే సీఎంను కలవాలని సభ్యులు నిర్ణయించుకున్నారు.



స్టాండింగ్ కమిటీ సమావేశంలో బైఠాయించిన జడ్పీటీసీలు

వీడు మావాడే..!

నవజాత శిశువును ఎవరో ఆస్పత్రిలో వదిలి వెళ్లారు

దక్కించుకునేందుకు పలువురు పోటీ పడ్డారు..



వెంటిలేటర్‌పై ఉన్న పసికందు

లోకం ఎరుగని పసివాడు..
పుట్టి కొన్ని గంటలయ్యుండొచ్చు..
అనారోగ్యంతో బాధపడుతుంటే..
ఎవరో వచ్చి ఆస్పత్రిలో చేర్చారు..
చెప్పాపెట్టకుండా వెళ్లిపోయారు..
ఆస్పత్రి సిబ్బంది ఆరా తీస్తుంటే..
'వీడు మావాడే.. ఇచ్చేయండి..' అని..
ఎంతో మంది ఎగబడుతున్నారు..
కొందరు గొడవకు దిగుతున్నారు..!
కన్నవారికి దూరమైన ఈ బుడ్డోడు..
దురదృష్టవంతుడా..?
ఏ సంబంధం లేకున్నా..
'మా వాడే..' అని వస్తున్న
ఎందరినో సంపాదించుకున్న అదృష్టవంతుడా..?

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 29: పట్టణంలోని జిల్లా ఆస్పత్రిలో బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు అప్పుడే పుట్టిన పసికందును వదిలేసి వెళ్లారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ రోహిల్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు అప్పుడే పుట్టిన మగబిడ్డతో ఆస్పత్రికి వచ్చారు. బిడ్డ ఊపిరి తీసుకోవడం కష్టంగా ఉండడంతో తీసుకొచ్చామని వైద్యులకు తెలిపారు. డ్యూటీలో ఉన్న వైద్యురాలు డా.కీర్తి పసికందును పరిశీలించి, ఆరోగ్య పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నందున వెంటనే వెంటిలేటర్ వార్డుకు పంపించారు. పసికందుకు ప్యాడ్ తదితరాలు తేవాలని పసికందును తీసుకొచ్చిన వారికి చెప్పారు. వారు వచ్చాక వివరాలు తీసుకుందామనుకుని ముందు బిడ్డను అడ్మిట్ చేసుకున్నారు. పసికందును తీసుకొచ్చిన ఇద్దరు తిరిగి రాలేదు. ఎంత సేపటికీ వారు రాకపోవడంతో సిబ్బంది.. సెక్యూరిటీతో కలిసి ఆస్పత్రి ప్రాంగణమంతా వెతికారు. అయినా వారు కనిపించలేదు. సిబ్బంది.. సూపరింటెండెంట్‌కు సమాచారం అందించారు. బిడ్డను తీసుకొచ్చిన వారెవరు, కారణాలు ఏమై ఉంటాయి తదితర విషయాలు విచారణలో తేలాల్సి ఉంది. ప్రస్తుతం పసికందు ఆరోగ్య పరిస్థితి బాగోలేదని తెలుస్తోంది. ఆ పసికూనకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. పసికందును వదిలించుకునేందుకే ఆస్పత్రికి తీసుకొచ్చారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సీసీ కెమెరాలను పరిశీలిస్తే ఎవరన్నది వెలుగుచూసే అవకాశం ఉంది. దీనిపై ఐసీడీఎస్ అధికారులకు సమాచారం చేరవేసినట్లు సూపరింటెండెంట్ తెలిపారు. వారు సాయంత్రం దాకా రాలేదు.

రోజంతా హైడ్రామా

ఆస్పత్రిలో గుర్తుతెలియని వ్యక్తులు మగబిడ్డను వదిలి వెళ్లారన్న విషయం ఆనోట.. ఈనోట పడి పట్టణమంతా పాకింది. దీంతో ఆ బిడ్డ తమబిడ్డేనంటూ మధ్యాహ్నం నుంచి పలువురు వచ్చి వైద్యులు, సిబ్బందితో మాట్లాడి బిడ్డను తీసుకెళ్లేందుకు యత్నించారు. మధ్యాహ్నం ముగ్గురు మైనారిటీ మహిళలు, ఒక పురుషుడు వచ్చి ఆ బిడ్డ తమ బంధువుల బిడ్డేననీ, తామే రాత్రి వదిలి వెళ్లామనీ, తమకు ఇవ్వాలని అడిగారని ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. రాత్రి బాహుజీనగర్‌కు చెందిన ముగ్గురు మహిళలు ఆ బిడ్డ తమ బిడ్డేనంటూ వచ్చారట. తమది తిరుపతి అనీ, కాన్పు కోసం పుట్టింటికి వచ్చాననీ, తనకు తెలియకుండా బిడ్డను తీసుకొచ్చారని చెప్పుకొచ్చారు. పోలీసులు, ఐసీడీఎస్ అధికారులకు అప్పగిస్తామనీ, వారు అడిగిన పత్రాలు సమర్పించి తీసుకెళ్లాలనీ, లేకుంటే జైలుకెళ్లారని చెప్పడంతో అక్కడి నుంచి జారుకున్నారు.

స్వయం ఉపాధి

కోర్సులకు శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 29

వివిధ స్వయం ఉపాధి, ఉద్యోగాలకు సంబంధించి ఉచిత కోర్సు ప్రారంభించనున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. ఈనెల 1 నుంచి ఆర్డీటీ స్టేడియం ఎదురుగా ఉన్న ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో 60 రోజుల పాటు ఉచిత శిక్షణ, అనంతరం సర్టిఫికెట్లు, ఉద్యోగం, ఉపాధి కల్పిస్తామన్నారు. సెల్ఫ్ లెర్నింగ్ సెంటర్‌లో బేసిక్ కంప్యూటర్ స్కిల్స్, ట్యాలీ, ఎంఎస్ ఆఫీస్, కంప్యూటర్ టైపింగ్, లైఫ్ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్, బేసిక్ స్పోకెన్ ఇంగ్లీష్, కస్టమర్ రిలేషన్‌షిప్ స్కిల్స్ కోర్సులో శిక్షణ ఉంటుందన్నారు. 20-30 సంవత్సరాలు మధ్య కలిగి ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, బీటెక్ చదివిన నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 73969 50345, 77807 52418ను సంప్రదించాలని కోరారు.

నేడు విద్యాదీవెన సొమ్ము విడుదల

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 29

జగనన్న విద్యాదీవెన సొమ్ము శుక్రవారం విడుదల అవుతుందని ఎస్సీ సంక్షేమశాఖ జేడీ మధుసూదన్‌రావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 40,006 మంది విద్యార్థుల తల్లుల ఖాతాలకు రూ.29.08 కోట్లు జమ అవుతుందని ఆయన వెల్లడించారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 29: మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆ పాఠశాలల కన్వీనర్ సంగీతకుమారి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికి ఉమ్మడి జిల్లాలోని 15 బీసీ గురుకుల పాఠశాలల్లో 400 మంది బాలురు, 560 మంది బాలికలకు 5వ తరగతిలో ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. బాలికలకు నార్పల, గోనబావి, డి.హీరేహాళ్, గుడిబండ, బుక్కపట్నం, టేకులోడు, నసనకోట, బాలురకు కొనకొండ్ల, కుందుర్పి, లేపాక్షి, రేగాటిపల్లి, పేరూరు, రొద్దం-1, 2, గుండుమల గురుకుల పాఠశాలల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో మాత్రమే చేసుకోవాలని సూచించారు. బీసీ, ఈబీసీ విద్యార్థులు 1-9-2013 నుంచి 31-8-2015 మధ్య జన్మించి ఉండాలని, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 1-9-2011 నుంచి 31-8-2015 మధ్య జన్మించి ఉండాలని తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరాల్లో 3, 4 తరగతులను ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదివి ఉండాలని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.లక్షకు మించకూడదని తెలిపారు. విద్యార్థి ఆధార్ కార్డు, ఫోన్ నంబరు, పాస్ ఫొటో, పుట్టిన తేదీ, కులం వివరాలు, 3, 4 తరగతులు చదివిన పాఠశాలల వివరాలు, తల్లిదండ్రుల రేషన్ కార్డు నంబరు, ఇంటి అడ్రస్ తదితర వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శుక్రవారం నుంచి మార్చి 31వ తేదీ వరకూ https://mjpapbcwreis.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని, అనంతరం ఓ కాపీని డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

మేం ఉద్యోగం ఇస్తాం...

జీతం మీరు ఇవ్వండి!

- ఆర్‌అండ్‌బీ పోస్టుల భర్తీ నోటిఫికేషన్‌లో వింత
- రాష్ట్ర వ్యాప్తంగా 467 పోస్టుల భర్తీకి జీవో జారీ
- జీతాల చెల్లింపు బాధ్యత ఎస్ఈలదేనని లింకు
- అతిథిగృహాల ఆదాయంతో చెల్లించాలని మెలిక
- ప్రతినెలా ఏకంగా రూ.70 లక్షల వరకూ భారం
- గెస్ట్‌హౌస్‌లను ఉచితంగా వాడేస్తున్న వీఐపీలు
- జిల్లా కేంద్రాల్లోనే 5 వేలకు మించని ఆదాయం
- చాలాచోట్ల నయాపైసా కూడా రావడం లేదు
- జీతాలు ఎలా చెల్లించాలని ఎస్ఈల ఆవేదన

అనంతపురం సిటీ: ఏటా జాబ్ కేలండర్ అన్నారు. ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలన్నీ భర్తీ చేస్తామన్నారు. పోలీసు ఉద్యోగాలు, మెగా డీఎస్సీ.. అబ్బో ఒకటేమిటి ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చారు. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక అన్నీ మర్చిపోయారు. నాలుగున్నరేళ్ల పాటు ఆ ఊసెత్తకుండా ఎన్నికలు దగ్గర పడటంతో ఇప్పుడు అరకొర పోస్టులతో నోటిఫికేషన్లు ఇస్తూ హడావుడి చేస్తున్నారు. నిరుద్యోగులను మభ్య పెట్టేందుకు ఒక వింత జీవో జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా రోడ్లు భవనాల శాఖ పరిధిలో అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన 467 పోస్టులు భర్తీ చేసేందుకు ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. జీతాలు మాత్రం ఆర్‌అండ్‌బీ శాఖ చెల్లిస్తుందని చెప్పకుండా లింకు పెట్టారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆర్‌అండ్‌బీ అతిథి గృహాల నుంచి వచ్చే ఆదాయం నుంచి కొత్త సిబ్బందికి జీతాలు చెల్లించాలని జీవోలో పేర్కొంది. ఈ బాధ్యతను ఆయా జిల్లాల ఎస్ఈలకు ప్రభుత్వం అప్పగించింది. 'ఉద్యోగాల భర్తీ మా బాధ్యత.. జీతాల చెల్లింపు ఎస్ఈల బాధ్యత' అన్నట్లుగా వ్యవహరిస్తోంది. పోనీ.. కొత్తగా నియమించే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు ఇచ్చేంత ఆదాయం అతిథిగృహాల నుంచి వస్తుందా.. అంటే అదీ లేదు. వీటికి వచ్చే ఆదాయం చాలా చాలా తక్కువ. చాలా చోట్ల ఒక్కోదానికి నెలకు రూ.3వేలు రావడం లేదు. కొన్నింటికి అసలు ఆదాయమే లేదు. ఇలాంటి పరిస్థితుల్లో జీతాలు ఎక్కడినుంచి చెల్లించాలని ఎస్ఈలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్లు, భవనాల శాఖ పరిధిలో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన 467 పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. కొత్తగా వచ్చే ఒక్కో ఉద్యోగికి నెలకు రూ.15వేలు చొప్పున అతిథి గృహాల ఆదాయం నుంచి జీతంగా ఇవ్వాలని జీవోలో పేర్కొన్నారు. అంటే వీరికి జీతాలకు నెలకు రూ.70లక్షల వరకూ ఖర్చవుతుంది. అధికార లెక్కల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 139 ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లు ఉన్నాయి. ఈ లెక్కన ఒక్కోదాని నుంచి సగటున రూ.50వేలకు పైగా జీతం చెల్లించాల్సి ఉంటుంది. పైసా కూడా ఆదాయం లేని అతిథిగృహాలు ఈ మొత్తాన్ని ఎలా చెల్లిస్తాయో ప్రభుత్వమే చెప్పాలి.

పోస్టుల వివరాలు

ఆఫీస్ సబార్డినేట్: 170
వాచ్‌మెన్: 139
శానిటరీ వర్కర్: 158
మొత్తం పోస్టులు: 467
ఒక్కో పోస్టుకు వేతనం: రూ.15,000

ఆర్‌అండ్‌బీ అతిథి గృహాలు

రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లో ఉన్నవి: 139
వీటి సగటు ఆదాయం నెలకు: రూ.2,000 లోపు
కొత్తగా జీతాలకు అయ్యే ఖర్చు: రూ.50వేలకు పైగా

33 వేల దరఖాస్తులు

రాష్ట్రంలోని 26 జిల్లాల పరిధిలో వాచ్‌మెన్-139, ఆఫీస్ సబార్డినేట్-170, శానిటరీ వర్కర్-158 పోస్టులు మొత్తం 467 ఉన్నాయని, వీటిని అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేస్తున్నట్లు ప్రభుత్వం నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఫిబ్రవరి 22 నుంచి 28వ తేదీ వరకు ఆయా జిల్లాల్లోని ఆర్‌అండ్‌బీ ప్రధాన కార్యాలయాల్లో అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. దీంతో జిల్లాల వారీగా ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం 33వేలకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు తెలిసింది. ఈ పోస్టులకు విద్యార్హత పదో తరగతి అని నోటిఫికేషన్‌లో పేర్కొన్నా.. బీటెక్, ఎంటెక్, పీజీ, డిగ్రీ పూర్తి చేసిన వారు కూడా దరఖాస్తు చేశారు.

ఆదాయం అంతంతే..

రాష్ట్రవ్యాప్తంగా 139 ఆర్‌అండ్‌బీ అతిథి గృహాలు ఉన్నాయి. వీటి నుంచి ఎక్కడా పెద్దగా ఆదాయం లేదని ఎస్ఈలే చెబుతున్నారు. వీటిలో దిగే వీఐపీలు ఎవరూ అద్దె చెల్లించడం లేదు. మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, జేసీలు వంటి వారు వస్తే.. అద్దె అడిగే సాహసం సిబ్బంది చేయలేకపోతున్నారు. చాలా మంది వీఐపీలు పైసా చెల్లించకుండా అతిథిగృహాలను వాడుకుని దర్జాగా వెళ్లిపోతున్నారు. వారిని డబ్బులు అడిగితే 'అంతే సంగతులు' అని ఉద్యోగులే అంటున్నారు. కొందరు మాత్రం తమ పరిస్థితిని అర్థం చేసుకుని నామమాత్రంగా నగదు చెల్లిస్తారని చెబుతున్నారు. 26 జిల్లాల్లోనూ ఇదే తంతు సాగుతోంది. జిల్లా కేంద్రాల్లో ఉన్న అతిథి గృహాలకు నెలకు రూ.2000 నుంచి రూ.5 వేల వరకు ఆదాయం వస్తోంది. కానీ నియోజకవర్గ కేంద్రాల్లో ఉన్న వాటికి రూ.2వేలు కూడా రావడం లేదు. పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే.. అతిథి గృహాల నుంచి వచ్చే ఆదాయం నుంచి కొత్త సిబ్బందికి జీతాలు చెల్లించాలని జీవోలో పేర్కొనడం ఏంటని కొందరు ఎస్ఈలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదెక్కడి జీవో?

వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆర్‌అండ్‌బీలో పరిస్థితి దారుణంగా తయారైంది. చేసిన పనులకు బిల్లులు కావడం లేదు. శాఖాపరంగా పనుల్లో ఎలాంటి పురోగతి లేదు. ఇప్పుడు ఉద్యోగాల భర్తీ పేరిట హడావుడి చేయడం, జీతాల చెల్లింపు బాధ్యతలను ఎస్ఈలపై మోపడం విమర్శలకు తావిస్తోంది. 'ఇప్పటి వరకూ చాలా నోటిఫికేషన్‌లు చూశాం. కానీ ఇలాంటి నోటిఫికేషన్‌ను ఏ ప్రభుత్వమూ విడుదల చేయలేదు' అని పలువురు ఎస్ఈలు వాపోతున్నారు. ఎన్నికల ముందు నిరుద్యోగులను మభ్యపెట్టేందుకే ప్రభుత్వం గిమ్మిక్కు జీవో జారీ చేసిందనే విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఉద్యోగాల భర్తీతో పాటు జీతాల చెల్లింపు బాధ్యత కూడా తీసుకోవాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

విద్యుత్ చార్జీల పెంపులో వైసీపీ రికార్డు

జనసేన పార్టీ రాయలసీమ మహిళా విభాగం కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత ఎద్దేవా

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 29: వైసీపీ ఐదేళ్ల పాలనలో తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచిన రికార్డు వైసీపీకే దక్కిందని జనసేన పార్టీ రాయలసీమ మహిళా విభాగం కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత ఎద్దేవా చేశారు. గురువారం ఆమె మహిళలతో మాటామంతి కార్యక్రమంలో భాగంగా మంగళవారికాలనీలో పర్యటించి స్థానిక సమస్యలను ప్రజలతో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పెండ్యాల శ్రీలత మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వ హయాంలో విద్యుత్ చార్జీలు పెంచడంతో ఇళ్లల్లో లైట్లు, ఫ్యాన్లు వేయాలంటేనే జనాలు జంకుతున్నారన్నారు. ఇలాగే రేట్లు పెంచుకుంటూ పోతూ ప్రజలను తిరిగి కరెంటులేని కాలానికి తీసుకెళ్లాలని వైసీపీ చూస్తున్నట్లు ఉందని ఎద్దేవా చేశారు. ఒక్కచాన్స్ అని మరోసారి ప్రజలకు ముందు కొస్తున్న వైసీపీకి అధికారం కట్టబెడితే రాష్ట్రం మొత్తం అంధకారంలో ముంచేస్తారని మండిపడ్డారు. కాలనీలో ము రుగు కాలువలు అధ్వానంగా ఉన్నా యని, మంచినీటి కొరత ఉండ టంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని అన్నారు. ప్రజలు ఏ మాత్రం మేలు చేయని వైసీపీ ప్రభు త్వాన్ని రానున్న సార్వత్రిక ఎన్ని కల్లో ఇంటికి పంపాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్ర మంలో పార్టీ వీర మహి ళలు, నాయకులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న పెండ్యాల శ్రీలత

ఇక రాగులకు బదులు రాగిపిండి

ధర కేజీ రూ.11.. నేటి నుంచి రేషన్ సరకులతో పాటు పంపిణీ : జేసీ



అనంతపురం టౌన్, ఫిబ్రవరి 29: ఇక నుంచి రేషన్ సరకులతో పాటు రాగులకు బదులు రాగి పిండిని ప్యాకెట్ల రూపంలో అందిస్తు న్నట్లు జాయింట్ కలెక్టరు కేతన్‌గార్గ్ తెలిపారు. గురు వారం ఆయన తన చాంబర్‌లో మాట్లాడుతూ... రాగిపిండి ధర కేజీ రూ.11గా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దీనితోపాటు బియ్యం, జొన్నలు, పోర్టిఫైడ్ గోధుమ పిం డి సరఫరా చేస్తున్నామన్నారు. ప్రతి సభ్యుడికి ఐదు కేజీలు, అంత్యోదయ కార్డుదారులకు 35 కేజీల బియ్యం ఉచితంగా ఇస్తామని, అంత్యోదయ కార్డుదారులకు చక్కెర కేజీ రూ 13.50కు, మిగతా కార్డుదారులకు అర కేజీ చక్కెర రూ17లకు పంపిణీ చేస్తామన్నారు.

ఈఈగా శైలజ బాధ్యతల స్వీకరణ

అనంతపురం, సిటీ, ఫిబ్రవరి 29: జిల్లా గృహ నిర్మాణశాఖ పరిధిలోని అనంతపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈగా) ఎం. శైలజ గురువారం స్థానిక ఆ శాఖ కార్యాల యంలో బాధ్యతలు స్వీకరించారు. అంతేకాకుండా ఆమె కళ్యాణదుర్గం డివిజన్ ఇన్‌చార్జి ఈఈగా కూడా విధులు నిర్వహి స్తున్నారు. ఆమెకు ఆశాఖ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

నేటి నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు



విద్యుద్దీపాలంకరణలో కాశీవిశ్వేశ్వరాలయం

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 29: జిల్లాలో పురాతన ఆలయాల్లో ఒకటైన అనంతపురంలోని మొదటిరోడ్డు కాశీ విశ్వేశ్వర కోదండ రామాలయం మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబైంది. శుక్రవారం నుంచి ఈనెల 11వ తేదీ వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో ఆలయానికి రంగులు వేయడంతోపాటు ఆలయాన్ని రకరకాల విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. శుక్రవారం నుంచి కాశీవిశ్వేశ్వర స్వామిని రోజుకొక వాహనంపై పురవీధుల్లో ఊరేగిస్తారు. రోజూ ఆలయ ఆవరణలోని వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

తాడేపల్లి గూడెం సభతో ప్యాలెస్ నేతల గుండెల్లో దడ

టీడీపీ శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణి శ్రీ

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 29: టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో తాడేపల్లి గూడెంలో నిర్వహించిన సభతో ప్యాలెస్ నేతల గుండెల్లో దడ మొదలైందని శింగనమల నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణి శ్రీ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీడీపీ, జనసేన సభ దిగ్విజయం అయ్యిందనేందుకు హాజరైన జనసంద్రమే నిదర్శనమన్నారు. రాబోవు ఎన్నికలు ఏపీకి చాలా కీలకమైందన్నారు. రాష్ట్రంలోని ఐదు కోట్ల మంది ప్రజల భవిష్యత్ కోసం టీడీపీ, జనసేన చేతులు కలిపాయన్నది చారిత్రక సత్యమన్నారు. సీఎం జగన్ అన్ని వర్గాల ప్రజలను నట్టేట ముంచాడన్నారు. రాష్ట్రంలో విధ్వంస, రాక్షస పాలన సాగించారని మండిపడ్డారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైంద న్నారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు రాష్ట్ర ప్రజలకు ఎంతో మేలు చేస్తాయన్నారు. వైసీపీ అరాచక పాలనతో విసిగిపోయిన ప్రజలు ఆ పార్టీని బంగాళాఖాతంలో కలిపేం దుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రాబోవు ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమికి మద్దతు నిచ్చి చంద్రబాబును మళ్లీ సీఎంను చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీల్లో తృతీయ స్థానం



తృతీయ స్థానంలో నిలిచిన ఏపీ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 29: ఇటీవల బీహార్ రాష్ట్ర రాజధాని పాట్నాలో నిర్వహించిన జాతీయ జూనియర్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఏపీ బాలుర జట్టు తృతీయ స్థానంలో నిలిచిందని ఏపీ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సీఈఓ వెంకటేశులు, కార్యదర్శి నాగేంద్ర తెలిపారు. జట్టుకు జాతీయ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సీఈఓ ప్రవీణ్ అనోకర్, అధ్యక్షుడు ఎల్ఆర్ మౌర్య, కోశాధికారి శ్రీకాంత్ తోరాట్ బహుమతి అందజేసి అభినందించారు.

సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించండి



పోలేపల్లి సమావేశంలో మాట్లాడుతున్న కన్వీనర్ సుధాకర్

రామగిరి, ఫిబ్రవరి 29: మండలంలో టీడీపీ గృహసాధికార సారథులు సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి.. పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని మండల కన్వీనర్ సుధాకర్ సూచించారు. మండలంలోని రామగిరి, పోలేపల్లి పంచాయతీల్లో టీడీపీ మండల నాయకులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జులు, బూత్ కన్వీనర్ల, సాధికార సారథులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ దౌర్జన్యాలు, అవినీతి, అప్పులు తదితర వాటిని ప్రజలకు వివరించి.. టీడీపీ గెలుపు అవశ్యకతను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు రామ్మూర్తినాయుడు, పరంధామ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి మారుతీప్రసాద్, శివకుమార్, శ్రీధర్ నాయుడు, మాదాపురం శంకర్, ఎస్ ఆంజనేయులు, అక్కులప్ప, రఘువీరాచౌదరి, నాగేశ్‌నాయుడు, శ్రీరామునాయక్, గుర్రంశీన, ఆవులముత్యాలు, సుబ్బరాయుడు, నాగరాజు, గంగిరెడ్డి, దుర్గప్ప పాల్గొన్నారు.

అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ పాఠశాల వార్షికోత్సవం

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 29: అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ పాఠశాల వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆదాయపన్నుశాఖ రిటైర్ కమిషనర్ నరసింహప్ప, జేఎన్‌టీయూ రెక్టార్ విజయకుమార్, పాఠశాల చైర్మన్ అనంతరాముడు, వైస్ చైర్మన్ రమేష్‌నాయుడు వేడుకలను ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల సీఏఓ నరసింహారావు, ప్రధానోపాధ్యాయురాలు నలిని, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పంట రుణాలను సకాలంలో రెన్యువల్ చేసుకోండి

నార్పల, ఫిబ్రవరి 29: మండల పరిధిలోని బీ పప్పూరు సొసైటీ బ్యాంక్‌లో పంట రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో రెన్యూవల్ చేసుకోవాలని సొసైటీ బ్యాంక్ సీఈఓ హరిపరమేశ్వర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు మార్చిలోపు వడ్డీ మాత్రమే చెల్లించి రుణాలు రెన్యువల్ చేసుకుంటే ప్రభుత్వ రాయితీలు వర్తిస్తాయని తెలిపారు. బ్యాంక్‌లో రికార్డులన్నీ కంప్యూటరీకరణ చేస్తున్నందున రైతులందరూ తప్పకుండా వన్‌బీ అడంగల్, ఆధార్ కార్డు, పాస్‌కార్డు, రెండు ఫొటోలు సంఘం కార్యాలయంలో అందజేయాలన్నారు.

కాశీవిశ్వేశ్వరుడిని దర్శించుకున్న గోవిందానందస్వామి

అనంతపురం కల్చరల్: స్థానిక పీటీసీలో నిర్వహిస్తున్న మహాగణపతి విగ్రహప్రతిష్ఠ వేడుకలకు హాజరైన కర్ణాటక రాష్ట్రం తలకాడులోని బాలకృష్ణానంద మహాసంస్థానాధిపతి గోవిందానంద సరస్వతి స్వామి గురువారం మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర ఆలయాన్ని సందర్శించారు. ఆయన వెంట అనువంశీకుడు హోసూరు రామసుబ్రహ్మణ్యం, ధర్మకర్తల మండలి సభ్యులు డి.సుబ్రహ్మణ్యం, వెంకటస్వామి, సురేష్‌బాబు, తిమ్మారెడ్డి, చంద్రశేఖర్ ఉన్నారు.

ఎన్నికలకు సన్నద్ధం కండి: టీడీపీ

చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 29: ఎన్నికల సమయం దగ్గర పడుతోందని, టీడీపీ గెలుపు కోసం ప్రతికార్యకర్త సన్నద్ధం కావాలని టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణ చౌదరి అన్నారు. స్థానిక టీడీపీ కార్యాల యం లో గురువారం మండలంలోని పార్టీ నాయ కులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కలిసి కట్టుగా సమన్వయంతో పనిచేయాలని శ్రేణులకు సూచించారు. సమావేశంలో కన్వీనర్ ము త్యాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబి లేసు, నాయకులు అంకే అమరేంద్ర, ఎజ్జే శంకర్, ముత్యాలప్ప, రామకృష్ణారెడ్డి, మా డెం సూర్యనారాయణరెడ్డి, పసల పెద్ద వెంక టరాముడు, బెస్తనాగార్జున, శివ, రామాంజి, చంద్రాయుడు, హరినాథరెడ్డి, గేటు కిష్టప్ప, రామాంజినేయులు, వెంకటాచారి, న్యామ ద్దల కిష్టప్ప, ఓబిరెడ్డి, సూరి, అమరేంద్రరెడ్డి, గేటునాగరాజు, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

పరామర్శ

చెన్నేకొత్తపల్లికి చెందిన హస్రీఫున్ కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మరణించింది. ఆమె కుటుంబ సభ్యులను ఎల్ నారాయణచౌదరి పరామర్శించారు. పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్టు తరఫున హస్రీఫున్ కుమార్తె సుల్తానాకు రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు.

దళితుల భూములు ఆక్రమిస్తే ఊరుకోం

ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి

అనంతపురం ప్రెస్‌క్లబ్ : దళితుల భూములు ఆక్రమించుకోవాలని చూస్తే చూస్తూ ఊరుకునేది లేదని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి హెచ్చరించారు. భూములు ఆక్రమించుకున్న కళ్యాణదుర్గం, బెలుగుప్ప, ఆత్మకూరు మండలాల బాధితులతో కలిసి గురువారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో విలే కరులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అనేక మంది దళిత, గిరిజ నులకు చెందిన భూములను భూ కబ్జాదారులు ఆక్రమించుకుంటున్నారని మండిప డ్డారు. న్యాయం కోసం అనేక ఏళ్లుగా అధికారులు చుట్టూతిరిగినా ప్ర యోజనం లేకుండాపోయిందన్నారు. భూములను రెవెన్యూ అధికారులే డబ్బులకు లాలూచి పడి ఇతరులకు ఆన్‌లైన్‌లో ఎక్కించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో బాధితులు నాగరాజు, లక్ష్మన్న, ఆదెప్ప, లింగప్ప, ఆదెమ్మ, ఋషిం గప్ప, జేఏసీ నాయకులు దొన తిమ్మప్ప, ఓబులేసు, ఈశ్వరయ్య, నారాయణ పాల్గొన్నారు.

పది పరీక్షలు జాగ్రత్తగా నిర్వహించండి



ఎక్కడ పేపర్ లీకైనా ఇట్టే తెలిసిపోద్ది: ఆర్‌జేడీ

అనంతపురం విద్య, ఫిబ్రవరి 29: పదో తరగతి పరీక్షలు జాగ్రత్తగా నిర్వహించాలని పాఠశాల విద్య కడప ఆర్‌జేడీ రాఘవరెడ్డి అధికారులకు సూచించారు. గురువారం ఈ పరీక్షల కోసం నియమించిన చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టు మెంటల్ ఆఫీసర్లతో స్థానిక ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది పది పరీక్షల ప్రశ్నాపత్రాలను పకడ్బందీగా రూపొందించారని, ఎక్కడ పేపర్ లీకైనా ఇట్టే తెలిసిపోతుందని అన్నారు. పది పరీక్షల్లో పిల్లలకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా తగు సదుపాయాలు కల్పించాలన్నారు. చీఫ్ సూపరింటెండెంట్ నుంచి డిపార్టుమెంటల్ ఆఫీసర్లు అలర్ట్‌గా ఉండాలని, పరీక్షలు సజావుగా సాగేలా చూడాలని అన్నారు. ఎవరూ సెల్‌ఫోన్లు పరీక్ష కేంద్రాల్లోకి తీసుకెళ్లరాదన్నారు. ఇందులో ఏసీ గోవింద్ నాయక్, డీసీఈబీ పురుషోత్తం, డిప్యూటీ డీఈఓలు శ్రీదేవి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ



అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 29: రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా స్థానిక నడిమివంక వద్ద తొలగించిన గంగమ్మ దేవాలయ పునర్ని ర్మాణం అనంతరం గురువారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణంలో పలు హోమాలు నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ నలుబోలు శ్రీలక్ష్మి, మధు రాయల్ ఆలయ కార్యవర్గానికి రూ.లక్ష విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త వడ్డే గోపాల్, భక్తులు పాల్గొన్నారు.

ఆప్షన్ త్రీ లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేయండి

అనంతపురం రూరల్: మండలంలో ఆప్షన్ త్రీ కింద ఇల్లు నిర్మించుకు న్న లబ్ధిదా రుల నుంచి డబ్బులు వసూలు చేసి కాంట్రాక్టరకు చెల్లించే విధంగా చూడాలని హౌసింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణారావు ఆదేశిం చారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ పుల్లయ్య, హౌ సింగ్ డీఈ రామ్మూర్తితో కలసి మండలంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు, ఉపాధి హామీ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో ఆప్షన్-3 కింద కాంట్రాక్టర్ ద్వారా 1,525 ఇళ్లను లబ్దిదారులు నిర్మించుకున్నారని, వారి నుంచి వీలైనంత త్వరగా డబ్బులు వసూలు చేసి కాంట్రాక్టర్‌కు అందించేలా చొరవ తీసుకోవాలన్నారు. లబ్ధిదారులు హౌసింగ్ డిపార్ట్‌మెంట్, కాంట్రాక్టర్‌కు సహకరించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 29: స్థానిక జాతీయ రహదారిపై గురువారం ఓ కారు ఆటోను ఢీకొన్న ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. అనంతపురానికి చెందిన షానుబీ కుటుంబసభ్యులు ఆటోలో అనంతపురం నుంచి చింతామణి బయలుదేరారు. చెన్నేకొత్తపల్లి వద్ద ఓ కారు ఆటోను వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న షానుబీ, మున్నాబీ, షాదామీ తదితరులు గాయపడ్డారు. వారిని వెంటనే 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కారు.. ఆటోను ఢీకొట్టి రోడ్డు పక్కన ఉన్న గుంతలోకి దూసుకుని పోవడంతో కారులోని వారు స్వల్పంగా గాయపడ్డారు. కేసు దర్యాప్తులో ఉంది.

కన్నుల పండువగా మైలార లింగేశ్వరస్వామి రథోత్సవం



స్వామివారి రథాన్ని లాగుతున్న భక్తులు

కుందుర్పి, ఫిబ్రవరి 29: మండలంలోని తెనగల్లు గ్రామంలో వెలసిన మైలార లింగేశ్వర రథోత్సవం గురువారం కన్నుల పండుగగా సాగింది. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి పది గంటలకు రథోత్సవాన్ని పూలతో అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య రథోత్సవం ముందు హోమాలు నిర్వహించారు.అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను రథంపై వుంచి గొ రవయ్యల నృత్యాలతో రథం చు ట్టూ ప్రదక్షిణ చేపట్టారు. అనంతరం వేలాది మంది భక్తుల మధ్య రథోత్సవాన్ని లాగారు. భక్తులు అరటి పండ్లు, కొబ్బరి కాయలను కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్ఐ వెంకటస్వామి బందోబస్తు పర్యవేక్షించారు.

వైభవంగా సీతారామాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

పుట్లూరు, ఫిబ్రవరి 29: మండలంలోని రంగమనాయునిపల్లి గ్రామంలో సీతారామాంజనేయస్వామి, నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠ గురువారం వైభవంగా నిర్వహించారు. గోపూజ, జలాధివాసం, అర్చనలతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అ నంతరం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పరిసర గ్రామాల ప్రజలు పెద్దఎత్తున స్వా మివారిని దర్శించుకున్నారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

కేంద్రం నిధులతో రైతులకు మరిన్ని సేవలు



మహాసభలో మాట్లాడుతున్న డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్ రెడ్డి, మేనేజర్ విజయభాస్కర్

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 29: కేంద్రప్రభుత్వం అందించే నిధులతో సొసైటీల కంప్యూటరీకరణ, డీసీఎంఎస్ ద్వారా రైతులకు మరిన్ని మెరుగైన సేవలు అందిస్తామని డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక కమలానగర్‌లోని డీసీఎంఎస్ కార్యాలయంలో నిర్వహించిన మహాసభ లో ఆయన మాట్లాడారు. డీసీఎంఎస్ ద్వారా ఫెర్టిలైజర్స్ రూ.12.81 కోట్ల మేర రైతులకు అందజేశామన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ జిల్లా మేనేజర్ విజయభాస్కర్, సభ్యులు శ్రీరామిరెడ్డి, జెబీవుల్లా, క్రిష్టప్ప, సుమంగళమ్మ, నాగమ్మ, అసిస్టెంట్ మేనేజర్ సత్యనారాయణ రెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరిస్తాం

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 29: వీలైనంత త్వరగా నగరంలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని నగర కమిషనర్ మేఘస్వరూప్ అన్నారు. గురువారం ఆయన హమాలీకాలనీ, మరువ కొమ్మకాలనీ, మంగళవారి కాలనీ, మారుతీనగర్‌లో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. తాత్కాలికంగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎస్ఈ రామమోహన్ రెడ్డి, ఈఈ సూర్యనారాయణ ఉన్నారు.

జర్నలిస్టు క్రికెట్ పోటీల్లో శ్రీసత్యసాయి, వైజాగ్ జట్ల విజయం

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 29: జర్నలిస్టు క్రికెట్ పోటీల్లో శ్రీసత్యసాయి, వైజాగ్ జట్లు విజయం సాధించాయి. మొదటి రాష్ట్రస్థాయి జర్నలిస్టు క్రికెట్ పోటీలు గురువారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో కొనసాగాయి. ఇందులో ఈస్ట్ గోదావరి జిల్లాపై శ్రీసత్యసాయి జిల్లా జట్టు, అనంతపురం పార్లమెంట్‌పై వైజాగ్, అనంతపురం జిల్లా జట్టుపై ఆంధ్రప్రభ స్టార్స్ జట్టు విజయం సాధించాయి. ముఖ్య అతిథులుగా హాజరైన శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం రంజీట్రోఫీ జట్టుకు ఎంపికైన జిల్లా క్రీడాకారుడు దత్తారెడ్డిని కలెక్టర్ సన్మానించారు. కార్యక్రమంలో జర్నలిస్టు మచ్చా రామలింగారెడ్డి పాల్గొన్నారు.



దత్తారెడ్డిని సన్మానిస్తున్న శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

రామగిరి తహసీల్దార్‌గా రమణి



రామగిరి: మండల తహసీల్దార్‌గా కె.రమణి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె చిత్తూరు జిల్లా నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడి తహసీల్దార్ నారాయణస్వామి కదిరి ఆర్డీఓ కార్యాలయానికి బదిలీ అయ్యారు. బదిలీపై వెళ్తున్న నారాయణస్వామిని నూతన తహసీల్దార్ రమణి, సిబ్బంది సన్మానించారు.

మోసం చేసి ఓట్లెలా అడుగుతారు?

వైసీపీపై పీఆర్‌ఎస్ ధ్వజం



మాట్లాడుతున్న శ్రీరాములు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 29: అమలుగాని హామీలిచ్చి రాష్ట్ర ప్రజలను మోసం చేసి.. మళ్లీ ఓట్లెలా అడుగుతారని పీఆర్‌ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీరాములు వైసీపీ పార్టీ, నాయకులపై ధ్వజమెత్తారు. గురువారం ఆ సమితి ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాలలోని డ్రామా హాల్‌లో 'ప్రజా చైతన్య సభ' నిర్వహించారు. ముందుగా నగరంలోని టవర్‌క్లాక్, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా ఆర్ట్స్ కళాశాల వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో శ్రీరాములు మాట్లాడుతూ.. జగన్‌రెడ్డి సాగు, తాగునీటి పెండింగ్ ప్రాజెక్టులు పూర్తీ చేస్తానని హామీ ఇచ్చి.. వాటిని అటకెక్కించారని మండిపడ్డారు. ఐదు సంవత్సరాలుగా ఈ ప్రాజెక్టులన్నింటికి ఒక్క రూపాయి బడ్జెట్ విడుదల చేయకపోవడంతో ఆ ప్రాజెక్టులన్నీ నిర్వీర్యమైపోతున్నాయన్నారు. జగన్ 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసినప్పటికీ.. ఒక్క కార్పొరేషన్‌కి నిధులు విడుదల చేయకపోవడంతో ఆ కార్పొరేషన్‌లన్నీ దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయన్నారు. ఇక రాష్ట్రంలో నిత్యావసర ధరలు పెరిగిపోవడంతో సాధారణ ప్రజలు మూడు పూటలా అన్నం తినలేని గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీ భూములకు రక్షణ లేకుండాపోయిందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధిస్తానని జగన్ చెప్పారని, ప్రత్యేక హోదా దేవుడెరుగు.. అసలు రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎటుచూసినా అధికార పార్టీ నేతలు అరచేతిలో వైకుంఠం చూపించి రేపు జరిగే సార్వత్రిక ఎన్నికల్లో గెలవాలని అబద్ధాలు చెప్పేందుకు సిద్ధమవుతున్నారన్నారు. ప్రజలు వీటన్నింటిని గమనించి వారి అబద్ధాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎస్సీ జన సంఘం నాయకులు దాసగానిపల్లి కుల్లాయప్ప, భారతీయ వడ్డెర ఐక్యత ఎస్టీ సాధన సమితి అధ్యక్షుడు కుల్లాయప్ప, ఏపీ పూసల సంఘం నాయకులు హనుమంతు పాల్గొన్నారు.

జగన్‌కు ఓటుతో బుద్ధిచెబుతాం



మాట్లాడుతున్న అక్కులప్ప

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 29: సంక్షేమ పథకాలు, కార్పొరేషన్‌లను రద్దు చేసి దళిత, గిరిజన ప్రజలను రోడ్డున పడేసిన సీఎం జగన్‌కు వచ్చే ఎన్నికల్లో ఓటుతో బుద్ధిచెబుతామని ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధికార ప్రతినిధి అక్కులప్ప పేర్కొన్నారు. గురు వారం ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రకటనల్లో మాత్రమే ప్రజలు ఆర్థికసాధికారతను సాధించారన్నారు. దళిత, గిరిజనులందరూ పేదరికాన్ని జయించారని వైసీపీ ప్రభుత్వం అబద్ధపు ప్రచారాలతో సమాజాన్ని నమ్మించేందుకు యత్నిస్తోం దన్నారు. ఉద్యోగాలు ఇవ్వలేదని, ఉన్నత చదువును అడ్డు కున్నారని, స్వయం ఉపాధి పథకా లను రద్దుచేశారని, శ్మశాన వాటికలను సైతం కబ్జాచేశారని ధ్వజమెత్తారు. ప్రశ్నించిన వారిపై దాడులు చేయడమే కాకుండా.. వారిపైనే కేసులు బనాయించి వేధించారన్నారు. ఇక ఎక్కడ అభివృద్ధి సాధించారో సీఎం జగన్ సమాధానం చెప్పాలని డిమాం డ్ చేశారు. దళిత, గిరిజనులపైనే అట్రాసిటీ కేసులు పెట్టిన ఘనత జగన్‌కే దక్కిందని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో వలసలు తగ్గించి సంక్షేమ పథకాల ద్వారా విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశా లు కల్పించారని, వైసీపీ ప్రభుత్వంలో బతకడమే కష్టంగా మార్చారని వాపోయారు. కార్యక్రమంలో నాయకులు ఉదయ్‌కుమార్, సంపత్‌కుమార్, లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.

పాల సేకరణ సజావుగా నిర్వహించాలి

రాప్తాడు, ఫిబ్రవరి 29: జగనన్న పాల వెల్లువ కింద పాల సేకరణ సజావుగా నిర్వహించాలని జేసీ కేతన్‌గార్గ్ తెలిపారు. గురువారం మండలంలోని చాపట్ల గ్రామంలో జగనన్న పాల వెల్లువ కింద పాలసేకరణ కోసం ఏర్పాటు చేసిన ఎండీఏసీ కేంద్రాన్ని జడ్పీ సీఈఓ నదియాదేవితో కలిసి పరిశీలించిన ఆయన మాట్లాడారు. జిల్లాలో అనంతపురం, రాప్తాడు, ఆత్మకూరు, బుక్కరాయసముద్రం, నార్పల మండలాల్లో పాల సేకరణ రెండు రోజుల కిందట ప్రారంభమైందన్నారు. గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించి ఎక్కువ మంది రైతులు పాల పోసేలా చూడాలన్నారు. జగనన్న పాల సేకరణ కార్యక్రమం వల్ల ఇతర డెయిరీలతో పోల్చితే అమూల్ ద్వారా అధిక ఆదాయం వస్తుందన్నారు. కార్యక్రమంలో బండమీదపల్లి పశు వైద్యాధికారి సోమేశ్వరి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ నాయకులకు ఓ న్యాయం..
సామాన్యులకు మరో న్యాయమా?


టౌన్‌బ్యాంక్ వద్ద నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు

ఉరవకొండ, ఫిబ్రవరి 29: టౌన్ బ్యాంక్ రుణాల రద్దు విషయంలో అధికార పార్టీ నాయకులకు ఓ న్యాయం, సామాన్యులకు మరో న్యాయమా అని టీడీపీ నాయకులు, చేనేత కార్మికుడు ముక్కర బాలచంద్ర మేనేజర్ వేదమూర్తిని నిలదీశారు. చేనేత కార్మికుడు బాలచంద్రకు టౌన్ బ్యాంక్ అధికారులు నోటీసులు అందజేశారు. దీనిపై టీడీపీ నాయకులు రాజేష్, నిమ్మల ప్రసాద్, చేనేత కార్మికుడు బాలచంద్ర బ్యాంక్ మేనేజర్, అధ్యక్షులతో వాగ్వాదానికి దిగారు. వైసీపీ నాయకుడు హసీఫ్ తీసుకున్న రుణాన్ని ఏకపక్షంగా ఎలా రద్దు చేశారని ప్రశ్నించారు. చేనేత కార్మికుడు బాలచంద్ర మాట్లాడుతూ రెండేళ్ల కితం రూ.5లక్షలు రుణాన్ని తీసుకున్నానని, అది వడ్డీతో కలిపి రూ.6.50లక్షలు అయ్యిందన్నారు. రూ.50వేలు తగ్గిస్తే, రుణం మొత్తం కడతానని అర్జీ ఇచ్చానన్నారు. తగ్గించడానికి వీలు పడదని తెలియజేస్తూ నోటీస్ ఇచ్చారని తెలిపారు. వైసీపీ నాయకుడి రుణ రద్దు విషయంపై అతనికి కూడా నోటీస్‌లు ఇస్తామని మేనేజరు తెలిపారు.

గుంతకల్లు డివిజన్ పేరును కొనసాగించాలి


నిరసన తెలుపుతున్న విద్యార్థి సేన నాయకులు

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 29: గుంతకల్లు రైల్వే డివిజన్ పేరును కొనసాగించాలని విద్యార్థి సేన అధ్యక్షుడు అబ్దుల్ బాసిద్ డిమాండ్ చేశారు. స్థానిక రైల్వే స్టేషన్ వద్ద సంఘం నాయకులు గురువారం నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ గుంతకల్లు జంక్షన్, డివిజన్ పేరును బాలాజీ డివిజన్ పేరుగా మార్చాలని కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదన పంపడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర విభజనలో భాగంగా రావాల్సిన రైల్వే జోన్ విశాఖకు తరలించడం దారుణమన్నారు. ఇప్పుడున్న గుంతకల్లు డివిజన్ పేరును మార్చి బాలాజీ డివిజన్‌గా చేయడాన్ని ప్రజలు వ్యతిరేకిస్తున్నారన్నారు. డివిజన్ పేరును అలాగే ఉంచాలని లేనిపక్షంలో పెద్దఎత్తున పోరాటాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. విద్యార్థిసేన పట్టణ కార్యదర్శి మహేష్ గుప్తా, సభ్యులు జయసింహా, సాయి, వీరన్న, మహబూబ్, సుందర్, సుధాకర్ పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం కావాలని ప్రార్థనలు


దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఐటీడీపీ నాయకులు

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 29: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు సీఎం కావాలని కోరుతూ కడపలోని అమీన్‌పీర్ దర్గాలో గురువారం అనంతపురం పార్లమెంట్ ఐటీడీపీ అధ్యక్షుడు పులికొండయాదవ్, ఆవుల శీన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గాలో చంద్రబాబు పేరట చదవింపులు చదవించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి గెలుపొందాలని, చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని కోరుకున్నట్లు వారు తెలిపారు. టీఎన్ఎస్ఎఫ్ సోషల్ మీడియా సభ్యులు సురేంద్రయాదవ్, తిరుమలయాదవ్, అజయ్, దాదు పాల్గొన్నారు.

రేపు ఉద్యోగ మేళా

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 29: పట్టణంలోని ఎస్కేపీ డిగ్రీ కళాశాలలో శనివారం ఉద్యోగామేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జవహర్ నాలెడ్జ్ కేంద్రం, కమిషనర్ ఆఫ్ కాలేజీయేట్ ఎడ్యుకేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నారని తెలిపారు. గుంతకల్లు పరిధిలోని ఏదైనా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 25 కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. అభ్యర్థులు రెజ్యూమ్ మూడు కాపీలు, సర్టిఫికెట్ జిరాక్స్‌లు మూడు కాపీలు, మూడు ఫొటోలు, ఆధార్ కార్డుతో హాజరుకావాలన్నారు.

ఘనంగా గులాంషా ఖాద్రీ షంషీర్


స్వామి వారిని దర్శించుకుంటున్న వెంకటశివుడు యాదవ్

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 29: పట్టణంలోని పోర్టర్‌లైన్‌లో వెలసిన హజరత్ గులాంషా ఖాద్రీ 64వ ఉరుసు ఉత్సవాలలో భాగంగా గురువారం షంషీర్‌ను ఘనంగా నిర్వహించారు. వేకువజామున పోర్టర్‌లైన్‌లోని జామియా మసీదు నుంచి షంషీర్‌ను అశ్వంపై ఉంచి మేళతాళాల మధ్య షంషీర్‌ను తీసుకెళ్లారు. అనంతరం షంషీర్‌ను స్వామి వారికి సమర్పించారు. ముజావర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గా కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వెంకటశివుడు యాదవ్ ప్రార్థనలు: హజరత్ గులాంషా ఖాద్రీ ఉరుసు ఉత్సవాలలో భాగంగా గురువారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకటశివుడు యాదవ్, పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్వామివారికి చదవింపులు చేయించారు.

జిల్లా సీనియర్ కబడ్డీ జట్టు ఎంపిక

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 29: ఉమ్మడి అనంతపురం జిల్లా సీనియర్ కబడ్డీ జట్టు ఎంపిక చేసినట్లు జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి లక్ష్మణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 26న పట్టణంలోని రాజేంద్రప్రసాద్ మున్సిపల్ పాఠశాలలో కబడ్డీ సీనియర్ జట్టు ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. 85 కిలోల విభాగం పురుషుల జట్టును ఎంపిక చేశామన్నారు. మార్చి 3 నుంచి 5 వరకు విశాఖలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని ఆయన తెలిపారు.

బీఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా గిరిజ

కణేకల్లు, ఫిబ్రవరి 29: మండలంలోని మీనహళ్లి గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ గిరిజ రాష్ట్ర మజ్దూర్ సమాఖ్య ఉపాధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. అంగన్‌వాడీ, ఆశ, పోస్టల్, బీఎస్ఎన్ఎల్ భవన నిర్మాణంతో పాటు అనేక ప్రభుత్వ రంగసంస్థ వ్యక్తులు సభ్యులుగా ఉన్న బీఎంఎస్ సమావేశం విశాఖపట్టణంలో జరుగగా కణేకల్లుకు చెందిన తనను ఉపాధ్యక్షురాలుగా ఎన్నిక చేసినట్లు ఆమె తెలిపారు. తనకు అవకాశం ఇచ్చిన అధ్యక్షులు రఘురాంకు, కార్యదర్శి నాయుడుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

విలేకరికి ఆర్థిక సాయం

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 29: రోడ్డు ప్రమాదంలో గాయపడిన విలేకరి నాగరాజుకు గురువారం ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేశారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని నాగరాజు స్వగృహానికి నాయకులు, జనసేన పార్టీ సమన్వయకర్త వాసగిరి మణికంఠ వెళ్లారు. ఆయనను పరామర్శించి, అధైర్యపడవద్దని, ధైర్యంగా ఉండాలని అండగా ఉంటామన్నారు. అనంతరం రూ.5వేలను అందజేశారు. ఏపీయూడబ్ల్యూజే గుంతకల్లు డివిజన్ అధ్యక్షుడు జీఎం రఫి, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

పుట్లూరు, ఫిబ్రవరి 29: మండలంలోని గరుగుచింతలపల్లి గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని గురువారం పట్టుకున్నట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు. పుట్లూరు నుంచి 15 మద్యం బాటిళ్లు తీసుకువెళుతుండగా స్వాధీనం చేసుకొని వేమయ్య అనే వ్యక్తిని అరెస్టుచేసి కేసు నమోదుచేశామని తెలిపారు.

గడ్డివాములు దగ్ధం

ఉరవకొండ, ఫిబ్రవరి 29: మండలంలోని ధర్మపురి గ్రామంలో గురువారం 6 గడ్డివాములు దగ్ధమయ్యాయి. ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో వాటిని ఆర్పేందుకు రైతులు ప్రయత్నించారు. మంటలు అదుపులోకి రాకపోవడంతో అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది సహాయంతో మంటలను ఆర్పారు. అప్పటికే గడ్డి వాములు పూర్తిగా దగ్ధమయ్యాయి. రామిరెడ్డికి చెందిన 2 గడ్డి వాములు, హరినాథ్, చంద్రశేఖర్, బాలకృష్ణ, సూర్యనారాయణకు చెందిన ఒక్కో గడ్డివామి కాలిపోయాయి. రూ.3లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: ఎమ్మెల్యే కేశవ్


కరపత్రాలు ప్రదర్శిస్తున్న పయ్యావుల కేశవ్, ప్రజలు, నాయకులు

ఉరవకొండ, ఫిబ్రవరి 29: చంద్రబాబుతోనే రాష్ట్రభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అన్నారు. వజ్రకరూరులో గురువారం బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు టీడీపీ నాయకులు కార్యకర్తలు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. గజమాలతో సత్కరించారు. ఇంటింటికీ వెళ్లి గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే సూపర్ సిక్సు పథకాల వల్ల కలిగే లబ్ధిని వివరించారు. వైసీపీ అధికారలోకి వచ్చిన తర్వాత అభివృద్ధిలో రాష్ట్రం 30ఏళ్లు వెనక్కి వెళ్లిందన్నారు. అన్ని వర్గాలను మోసం చేశారన్నారు. టీడీపీ- జనసేన పొత్తుతో వైసీపీలో వణుకు మొదలైందన్నారు. మండల కన్వీనర్ నూతేటి వెంకటేష్, టీడీపీ నాయకులు తట్రగల్లు సుధాకర్, నాగేంద్ర, నాగభూషణం, ఎర్రిస్వామి, దస్తగిరి, మండి ఎర్రిస్వామి, వన్నూరుస్వామి, వలి, అనంతయ్య, జయప్పచౌదరి, మల్లికార్జున, గురప్ప, జనసేన నాయకులు కేశవ పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయం ప్రారంభం: మండల కేంద్రంలోని ఎస్‌బీఐ ఏటీఎం పక్కన టీడీపీ కార్యాలయాన్ని మండల కన్వీనర్ నూతేటి వెంకటేశులు గురువారం ప్రారంభించారు. కార్యాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే పార్టీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ సందర్శించారు. నాగేంద్ర, నాగభూషణం, దస్తగిరి, జయప్పచౌదరి, వలి పాల్గొన్నారు.

టీడీపీ విజయానికి కృషి చేయాలి


టీడీపీలోకి చేరిన వారితో పయ్యావుల శ్రీనివాసులు

కూడేరు, ఫిబ్రవరి 29: వచ్చే ఎన్నికల్లో ఉరవకొండ నియోజకవర్గంలో తెలుగుదేశంపార్టీ విజయానికి కృషి చేయాలని సీనియర్ నాయకుడు పయ్యావుల శ్రీనివాసులు పిలుపునిచ్చారు. గురువారం కూడేరుకు చెందిన దామోదర్‌నాయుడు, రంగప్ప, బోయపాటి శంకర తదితరులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరికి పయ్యావుల శ్రీనివాసులు కండువాల కప్పారు. నియోజక అభివృద్ధి కోసం పార్టీలోకి చేరినట్లు దామోదర్‌నాయుడు తెలిపారు.

టీడీపీలోకి చేరిక

బెళుగుప్ప: మండలంలోని బెళుగుప్ప తండాకు చెందిన వైసీపీ నాయకులు రూప్లానాయక్, తిరుపాల్ నాయక్, రాము నాయక్ టీడీపీలోకి చేరారు. సీనియర్ నాయకులు పయ్యావుల శ్రీనివాసులు వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తూ అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని సూచించారు. మండల కన్వీనర్ ప్రసాద్, మల్లికార్జున, కంచిరాముడు, త్రివేదినాయుడు, ప్రభాకర్ నాయక్, లక్ష్మీబాయి, శీనా నాయక్, ప్రవీణ్ నాయక్ పాల్గొన్నారు.


పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న శ్రీనివాసులు

మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలి



ఉరవకొండ తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

ఉరవకొండ, ఫిబ్రవరి 29: మధ్యంతర భృతి(ఐఆర్) వెంటనే ప్రకటించాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలో గురువారం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న రెండు డీఏలను మంజూరు చేస్తూ, గత డీఏ బకాయిలను విడుదల చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. నాయకులు భాస్కర్, హనుమప్ప, పాండురంగ, నరసింహులు, క్రిష్టప్ప, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గుత్తి: ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు 12వ పీఆర్సీ అమలు పరచాలని 30శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. జేఏసీ నాయకులు దేశాయి నాగరాజు, చార్లెస్, లాలూ సాహెబ్, ఆదినారాయణ పాల్గొన్నారు.

తాడిపత్రిటౌన్: ఐఆర్ 30 శాతం వెంటనే ప్రకటించాలని కోరుతూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నాయకులు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. ఏపీటీఎఫ్ పూర్వ అధ్యక్షుడు రఘురామిరెడ్డి, జిల్లా కార్యదర్శి డేనియల్, రామ్‌దాస్, అంకాలు, ఓబయ్య, జయచంద్ర, శ్రీవాస్తవ పాల్గొన్నారు.



తాడిపత్రిలో అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పంచాయతీ కార్యదర్శికి గాయాలు


గాయపడ్డ పంచాయతీ కార్యదర్శి ఎర్రిస్వామి

యాడికి, ఫిబ్రవరి 29: విధులు ముగించుకొని ద్విచక్రవాహనంపై ఇంటికి వెళుతుండగా బుధవారం రాత్రి రోడ్డుప్రమాదంలో యాడికి పంచాయతీ కార్యదర్శి ఎర్రిస్వామి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక గ్రామ పంచాయతీ సిబ్బంది తెలిపిన వివరాలమేరకు యాడికి గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎర్రిస్వామి ఉరవకొండలో నివాసం ఉంటున్నాడు. బుధవారం విధులకు హాజరైన ఆయన సాయంత్రం 6 గంటల వరకు యాడికి గ్రామ పంచాయతీ కార్యాలయంలోనే ఉన్నట్లు తెలిపారు. అనంతరం ద్విచక్రవాహనంపై ఉరవకొండకు బయలుదేరాడని తెలిపారు. వజ్రకరూరు సమీపాన రోడ్డుప్రమాదానికి గురైనట్లు తెలిపారు. మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించినట్లు తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

గుత్తి, ఫిబ్రవరి 29: పెళ్లిచేసుకున్న తల్లిదండ్రులు, బంధువుల వేధింపులు తాళలేక షాషావలి అనే యువకుడు గురువారం తెల్లవారుజామున ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం చిన్న జొన్నగిరి గ్రామానికి చెందిన షాషావలి అదే గ్రామానికి చెందిన ఓ అమ్మాయితో ఏడాది క్రితం వివాహం అయ్యిందన్నారు. అమ్మాయి తల్లిదండ్రులు చిన్నపాటి విషయంపై అల్లుడితో గొడవకు దిగారు. తనపై తన భార్య కుటుంబ సభ్యులు దాడి చేయడంతో ఆ అవమానం భరించలేక ఇంట్లో విషద్రావకం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. చికిత్స నిమత్తం షాషావలిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురంకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


రాజేంద్ర(ఫైల్)

విడపనకల్లు, ఫిబ్రవరి 29: మండలంలోని అంచనహాలు గ్రామం వద్ద ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతిచెందిన సంఘటన గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే.. వజ్రకరూరు మండలం కమలపాడు గ్రామానికి చెందిన బోయ రాజేంద్ర (28) మేనత్త శాంతమ్మను ద్విచక్రవాహనంలో ఎక్కించుకొని విడపనకల్లు మండలం గడేకల్లుకు బయలు దేరాడు. గుంతకల్లు మీదుగా గడేకల్లుకు వస్తూ ఉండగా, అంచనహాలు గ్రామం వద్ద 67వ జాతీయ రహదారిపై గుంతకల్లు నుంచి బళ్లారికి వెళుతున్న లారీ ఢీకొట్టింది. రాజేంద్ర అక్కడికక్కడే మృతి చెందగా శాంతమ్మ గాయాలతో బయట పడింది. ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన లారీ వంద మీటర్లు దూరంలో బోల్తాపడింది. లారీ డ్రైవర్ అతిగా మద్యం తాగడం వల్లే ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు తెలిపారు. గాయపడిన శాంతమ్మను గుంతకల్లు ఆసుపత్రికి తరలించారు. విడపనకల్లు ఎస్ఐ ఖాజా హుస్సేన్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

కళ్యాణదుర్గం రూరల్, ఫిబ్రవరి 29: కుటుంబ కలహాలతో వృద్ధుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మారెంపల్లి కాలనీకి చెందిన బోయ నరసింహులు(70) అనే వృద్ధుడు కుటుంబ సమస్యలను తట్టుకోలేక పట్టణంలోని సెరికల్చర్ ఆఫీసు పక్కన వేపచెట్టుకు ఉరివేసుకుని వేలాడుతుండగా అటువైపు వెళ్లిన ప్రజలు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే వారు వచ్చి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు వున్నట్లు తెలిపారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సాయినగర్‌లో చోరీ

తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 29: పట్టణంలోని పుట్లూరు రోడ్డు సాయినగర్‌లో నివాసం ఉంటున్న అస్లాంబాషా ఇంటిలో గురువారం చోరీ జరిగిందని పోలీసులు తెలిపారు. రెండురోజులక్రితం అస్లాంబాషా ఇంటికి తాళాలు వేసి కుటుంబసభ్యులతో కలిసి సొంత ఊరుకు వెళ్లాడు. గురువారం తాడిపత్రికి వచ్చిన అస్లాంబాషా ఇంటిలోపల ఉన్న బీరువాను పరిశీలించగా గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారని గుర్తించాడు. ఇంటి పైనుంచి లోపలికి చొరబడి బీరువాలో ఉన్న 30తులాల బంగారు, రూ.6లక్షల నగదు చోరీకి గురైందని సమాచారం.బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేస్తామని పోలీసులు తెలిపారు.

సొమ్ము ప్రభుత్వానిది..
హెల్త్ క్లినిక్‌కు సర్పంచు ఇంటి పేరా!
● బీజేపీ నాయకుల మండిపాటు



హెల్త్ క్లినిక్ భవనంపై వైసీపీ సర్పంచు ఇంటి పేరు

కూడేరు, ఫిబ్రవరి 29: కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ కింద హెల్త్ క్లినిక్ భవనాలకు నిధులు మంజూరు చేసింది. కేంద్ర ప్రభుత్వం పేరు మాత్రమే ఉండాల్సిన చోట స్థానిక వైసీపీ సర్పంచు ఇంటి పేరును రాయడంపై బీజేపీ నాయకులు మండిపడుతున్నారు. తక్షణం పేరును తొలగించాలని లేకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొనకొండ రాజేష్ పేర్కొన్నారు. కూడేరు మండలం మరుట్ల 2వ కాలనీలో రూ.20 లక్షలతో నిర్మించిన హెల్త్ క్లినిక్ భవనం పనులు పూర్తయ్యాయి. భవనంపై ఆయుష్మాన్ భారత్‌తోపాటు వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్ మధ్యలో నిర్మాణ సహాయకులు కొత్తగొల్లవారి కుటుంబీకులు అని రాయడం ఆశ్చర్యానికి గురి చేస్తోందని, ప్రభుత్వ భవనాలపై ఇలాంటి రాతలు ఎన్నడూ చూడలేదన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ధి

బెళుగుప్ప, ఫిబ్రవరి 29: కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ ఉరవకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి పొడపాటి రామానాయుడు పేర్కొన్నారు. గురువారం బెళుగుప్పలో కన్వీనర్ బాబు షా, సీపీఎం నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పేద కుటుంబాలకు రూ.5 వేలు నగదు, రైతులకు రుణమాఫీ అమలు చేస్తున్నట్లు మేనిఫెస్టోలో ప్రకటించామన్నారు. నాయకులు భీమన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

సెల్‌టవర్ నిర్మాణాన్ని నిలిపివేయండి

యాడికి, ఫిబ్రవరి 29: మండలకేంద్రంలోని రాఘవేంద్రకాలనీలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సెల్‌టవర్ నిర్మాణ పనులను నిలిపివేయాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. గురువారం కాలనీవాసులు తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ ఆనంద్‌బాబుఆచారికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ స్థానికుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా సెల్‌టవర్ నిర్మాణం చేపడుతున్నారన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో బండారు బాలకృష్ణ, హరికృష్ణ, బద్దెల విశ్వనాథ్, విజయ్‌కుమార్, ఈశ్వరయ్య, నాగరాజు, నారాయణస్వామి, హాజీవలి, షావలి, మంజునాథ్ ఉన్నారు.

సీవీ రామన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 29: ప్రతి విద్యార్థి సీవీ రామన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ఎంఈఓ నాగరాజు, అదనపు ఎంఈఓ రామగోవిందు అన్నారు. పట్టణంలోని పుట్లూరు రహదారిలో ఉన్న శ్రీవాణి స్మార్ట్ స్కూల్‌లో గురువారం సైన్స్‌దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు నమూనాలను ఎంఈఓ, అదనపు ఎంఈఓలతోపాటు విద్యాసంస్థల చైర్మన్ గంగాధర్ తిలకించారు. అకడమిక్ డైరెక్టర్ సరస్వతమ్మ, కార్తీక్, ప్రిన్సిపాల్ బాలస్వామి, ఇస్మాయిల్, అనిల్‌కుమార్, రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రిజర్వాయరులో నీటి నిల్వ 0.456 టీఎంసీలు

బెళుగుప్ప, ఫిబ్రవరి 29: మండలంలోని జీడిపల్లి రిజర్వాయరులో ప్రస్తుతం నీటి నిల్వ 0.456 టీఎంసీలు వున్నట్లు గురువారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. రిజర్వాయరుకు 485 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వుండగా ఇక్కడి నుంచి ఫేజ్-2కు ఔట్ ఫ్లో కింద 600 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు.

ప్రచారంలో ప్రత్యర్థి పార్టీలు ఒకేచోట!


టీడీపీ కార్యకర్తలు రహదారిపై ఉండగా వైసీపీ నాయకుల కాన్వాయ్‌కి బందోబస్తు కల్పిస్తున్న పోలీసులు

కళ్యాణదుర్గం రూరల్, ఫిబ్రవరి 29: ప్రచారంలో వైసీపీ, టీడీపీ నాయకులు ప్రవాహంలా కదిలి సీబాయి గ్రామంలో కలిశారు. గురువారం అనంతపురం ఎంపీ తలారి రంగయ్య ప్రచారం నిమిత్తం సీబాయి గ్రామానికి చేరారు. అదే సమయంలో కళ్యాణదుర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు అనంతపురం నుంచి భారీ కాన్వాయ్‌తో అక్కడికి వస్తుండటంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో గ్రామానికి చేరుకున్నారు. అమిలినేని సురేంద్రబాబు రాక కోసం ప్రధాన రహదారిపై వేలాది మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు వేచి వుండగా, గ్రామంలో ప్రచారం ముగించుకుని మానిరేవుకి వెళ్తున్న కళ్యాణదుర్గం సమన్వయ కర్త రంగయ్య తన కార్యకర్తల కాన్వాయ్‌తో టీడీపీ నాయకులు ఎదురుపడటంతో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఎటువంటి ఇబ్బంది లేకుండా ఎవరికివారు సాఫీగా వెళ్లిపోయారు.

తాగునీటి సమస్యపై వైసీపీ కౌన్సిలర్ల ఆగ్రహం


మున్సిపల్ కమిషనర్‌ను నిలదీస్తున్న వైసీపీ కౌన్సిలర్లు

గుత్తి, ఫిబ్రవరి 29: ప్రజలకు తాగునీటి సరఫరా చేయడంలో అధికారులు ఘోరంగా విఫలమయ్యారని అధికారులపై అధికార పార్టీ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో గురువారం సర్వసభ్య సమావేశం చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, కమిషనర్ శ్రీనివాసులు సమక్షంలో నిర్వహించారు. అధికారులు, కౌన్సిలర్ల మధ్య మాటల యుద్ధం సాగింది. అధికారులపై చైర్‌పర్సన్‌తో పాటు పాలకవర్గ కౌన్సిలర్లు మండిపడ్డారు. నెలల తరబడి వార్డులలో నీటిని సరఫరా చేయకపోతే ప్రజలకు ఏమి సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఇంజనీరింగ్ అధికారులు బాధ్యతాయుతంగా కూడా పనిచేయడంలేదని ఆరోపించారు. అధికారుల తీరుపై కౌన్సిలర్లు ఒక్కసారిగా పోడియం వద్దకు చేరుకొని కమిషనర్‌తో వాగ్వాదం చేశారు. తాగునీరు సరఫరా చేయకపోతే ప్రజలతో వచ్చి ఆందోళన చేసే పరిస్థితి తీసుకోరావద్దని హెచ్చరించారు. నీటి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం


అలంకరణలో స్వామివారు

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 29: పట్టణంలోని రాజేంద్రనగర్‌లో వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ చేసి 23సంవత్సరాలలో అడుగుపెడుతున్న సందర్భంగా ఉదయం స్వామి వారి మూలవిరాట్టు పాదాలకు సుగంధద్రవ్యాలతో భక్తుల చేత అభిషేకం చేయించారు. అలాగే లలితాదేవి, వకులామాత, కుబేరుల విగ్రహాల ప్రతిష్ఠలో భాగంగా స్వామివార్ల మూలవిరాట్టుకు అభిషేకం చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యదర్శి నారాయణస్వామి, కోశాధికారి గుండా సుధాకర్, ప్రసాద కమిటీ చైర్మన్ జయంతి వెంకట్, సభ్యులు సుదర్శన్‌బాబు, ప్రవీణ్, కామిశెట్టి రఘు, నామజీవన్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కన్నుల పండువగా మైలార లింగేశ్వరస్వామి రథోత్సవం


స్వామివారి రథాన్ని లాగుతున్న భక్తులు

కుందుర్పి, ఫిబ్రవరి 29: మండలంలోని తెనగల్లు గ్రామంలో వెలసిన మైలార లింగేశ్వర రథోత్సవం గురువారం కన్నుల పండుగగా సాగింది. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి పది గంటలకు రథోత్సవాన్ని పూలతో అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య రథోత్సవం ముందు హోమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను రథంపై వుంచి గొరవయ్యల నృత్యాలతో రథం చుట్టూ ప్రదక్షిణ చేపట్టారు. అనంతరం వేలాది మంది భక్తుల మధ్య రథోత్సవాన్ని లాగారు. భక్తులు అరటి పండ్లు, కొబ్బరి కాయలను కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్ఐ వెంకటస్వామి బందోబస్తు పర్యవేక్షించారు.

ఆలయ జీర్ణోద్ధరణ పూజలు ప్రారంభం


విశేష అలంకరణలో చౌడేశ్వరిదేవి అమ్మవారు

యాడికి, ఫిబ్రవరి 29: మండలకేంద్రంలోని మార్కెట్‌వీధిలో నూతనంగా నిర్మించిన చౌడేశ్వరిదేవి ఆలయ జీర్ణోద్ధరణ పూజలు గురువారం ప్రారంభమయ్యాయి. వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ పూజలు చేశారు. పంచలోహాలతో తయారుచేసిన అమ్మవారి నూతన ఉత్సవమూర్తికి గ్రామోత్సవం నిర్వహించారు. శుక్రవారం ఆలయంలో అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వైభవంగా సీతారామాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ


అలంకరణలో స్వామివారు

పుట్లూరు, ఫిబ్రవరి29: మండలంలోని రంగమనాయునిపల్లి గ్రామంలో సీతారామాంజనేయస్వామి, నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠ గురువారం వైభవంగా నిర్వహించారు. గోపూజ, జలాధివాసం, అర్చనలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పరిసర గ్రామాల ప్రజలు పెద్దఎత్తున స్వామివారిని దర్శించుకున్నారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.